ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం
రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


NO
SMOKING
ALCOHOL
SAY NO
TO DRUGS

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 58 సోమవారం 09 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 58 Monday 09 - 02 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## ఉన్న జిల్లాలను తొలగించేది లేదు
## కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేది లేదు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- భూపాలపల్లి జిల్లాను కాంగ్రెస్ రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న సీఎం రేవంత్‌రెడ్డి
- జిల్లాలను రద్దు చేసే ఆలోచన తనకు లేదని స్పష్టం
- పురపాలిక ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- సింగరేణి కార్మికుల వల్లే ప్రజాప్రభుత్వం అధికారంలో ఉందని స్పష్టం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామంటూ హామీ
- తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కీలక పాత్రపోషించిందని కొనియాడారు
- కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారని సీఎం
- విపక్షాలపై తీవ్ర విమర్శలు చేసిన సీఎం



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 08 :** భూపాలపల్లి జిల్లాను కాంగ్రెస్ రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న జిల్లాలను తొలగించేది లేదని, కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేది లేదని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. దీనిలో భాగంగా జిల్లాలోని గుణపురం మండలం చెల్పూర్ పరిధిలో బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. జిల్లాలను రద్దు చేసే ఆలోచన తనకు లేదని స్పష్టం చేశారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేయాలంతే ప్రజలతో చర్చించే చేస్తామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా ఎక్కడికీ పోదు, ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. ఈ విషయంపై కొందరికి విషం చిమ్మడమే పని అని విపక్షాలను విమర్శించారు. మెడికల్ బోర్డు విషయంలో విషం చిమ్మితే ఊరుకునేది - మిగతా 2 లో

### ఒవైసీపై బండి సంజయ్
## విమర్శనాస్త్రాలు



- ఎప్పుడైనా ముస్లిం మహిళల సమస్యలపై ఒవైసీ మాట్లాడారా అన్న బండి సంజయ్
- ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళలకు మేలు జరిగిందా లేదా చెప్పాలన్న బండి సంజయ్
- ట్రిపుల్ తలాక్ రద్దును వ్యతిరేకిస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపు

**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 08 :** ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై బీజేపీ నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శనాస్త్రాలు సంధించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కరీంనగర్‌లో - మిగతా 2 లో




## యాసంగి రైతు భరోసాపై కీలక అప్‌డేట్

- నిధుల విడుదల ఎప్పుడంటే..!
- యాసంగి రైతు భరోసా కోసం ప్రభుత్వ కసరత్తు
- నిధుల కోసం బహిరంగ మార్కెట్ నుంచి రూ.9,000 కోట్ల రుణం
- ఈ నెల 10న ఆర్బీఐ ద్వారా నిధుల సమీకరణకు ప్లాన్
- మున్సిపల్ ఎన్నికల తర్వాతే నిధులు జమ చేస్తామన్న సీఎం రేవంత్

## 1.25 కోట్ల మంది హిందువులు
## పోరాడాలని నిర్ణయించుకుంటే...!

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు
- బంగ్లా హిందువుల పోరాటానికి ప్రపంచ హిందువుల మద్దతు ఉంటుందన్న భగవత్
- ముంబైలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వ్యాఖ్యలు
- బంగ్లాలో మైనారిటీలపై పెరిగిన హింసపై ఆందోళన
- భారత్‌ను ఎవరూ బలహీనపరచలేరని స్పష్టీకరణ
- జనాభా మార్పులపై గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శ



**వార్త సంధ్య, ముంబై , ఫిబ్రవరి 08 :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ బంగ్లాదేశ్‌లోని హిందువుల పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులు తమ హక్కుల కోసం పోరాడాలని నిర్ణయించుకుంటే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులందరూ వారికి అండగా నిలుస్తారని ఆయన భరోసా ఇచ్చారు. ముంబైలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ముంబైలోని వర్లీలో ఉన్న నెహ్రూ సెంటర్‌లో '100 ఇయర్స్ ఆఫ్ సంఘ్ జర్నీ: న్యూ హొరైజన్స్' పేరిట రెండు రోజుల కార్యక్రమం జరిగింది. రెండో రోజైన ఆదివారం భగవత్ ప్రసంగించారు. "బంగ్లాదేశ్‌లో సుమారు 1.25 కోట్ల మంది హిందువులు ఉన్నారు. వారు అక్కడే ఉండి పోరాడాలని నిర్ణయించుకుంటే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులంతా వారికి సహాయం చేస్తారు" అని - మిగతా 2 లో

## నింగిలోకి 'రుద్రమ' రాకెట్!

- వరంగల్ చరిత్రలో తొలిసారి
- వరంగల్ చరిత్రలో తొలిసారిగా మోడల్ రాకెట్ ప్రయోగం
- జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న కార్యక్రమం
- 'రుద్రమ' పేరుతో రాకెట్‌ను ప్రయోగించనున్న నిర్వాహకులు
- నిట్, కుడా సహకారంతో ఇస్రో స్పేస్ ట్యూటర్ శశాంక్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- విద్యార్థులు, ఆసక్తి ఉన్నవారికి ప్రవేశం ఉచితమని ప్రకటన




## మన సైన్యం దెబ్బతీసిన ఎయిర్ బేస్ లో పాక్ మరమ్మతులు

- ఆపరేషన్ సిందూర్‌లో పాక్షికంగా దెబ్బతిన భోలారీ ఎయిర్ బేస్
- మరమ్మతుల్లో భాగంగా హ్యాంగర్‌ను తొలగిస్తున్న దృశ్యాలు వైరల్
- ఐఏఎఫ్ దాడుల్లో తమకు ఎలాంటి నష్టం వాటిల్లలేదన్న పాక్




**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 08 :** భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ లో తమకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, తామే భారత విమానాలు కూల్చేశామని పాకిస్థాన్ ప్రగల్భాలు పలుకుతున్న సంగతి తెలిసిందే. వాస్తవాలను కప్పిపెట్టి ఆ దేశం చేస్తున్న ప్రకటనల్లోని డొల్లతనం మరోసారి బయటపడింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) యుద్ధవిమానాలు - మిగతా 2 లో




## "నామ్ నరేందర్... కామ్ సరెండర్"

- ప్రధాని మోదీపై షర్మిల విమర్శనాస్త్రాలు
- అమెరికాతో ప్రధాని మోదీ ఒప్పందంపై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు
- ఇది గ్రేట్ డీల్ కాదు, దేశానికి బ్లాక్ డీల్ అని వ్యాఖ్య
- అమెరికా బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపణ
- సున్నా సుంకాలతో స్వదేశీ పరిశ్రమలకు, రైతులకు తీవ్ర నష్టమని ఆందోళన
- ఒప్పందం పూర్తి వివరాలను వెంటనే బయటపెట్టాలని డిమాండ్

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్

- విచారణకు ఆదేశించిన సీఎం చంద్రబాబు
- దేవరపల్లి గిరిజన ఆశ్రమ హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్
- 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి
- ఘటనపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక
- విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 08 :** ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో గల ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం లోగా దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.వివరాల్లోకి వెళ్తే.. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దేవరపల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో - మిగతా 2 లో

## లడ్డు వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా మాట్లాడాలి



- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- లడ్డూపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న మంత్రి నాదెండ్ల
- అయోధ్య లడ్డూలకు ప్రత్యేక నెయ్యి వాడటమే కల్తీకి నిదర్శనం
- మఠాధిపతులు, ధార్మిక పెద్దలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలి

**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 08 :** తిరుమల లడ్డు నెయ్యి కల్తీ వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ అని, ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించిన అంశం కాదని, కోట్లాది మంది విశ్వాసాలతో ముడిపడిన అత్యంత సున్నితమైన విషయమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షసాధింపుగా మార్చేందుకు వైసీపీ చేస్తున్న - మిగతా 2 లో

# సంపాదకీయం

## పాక్‌కు బలూచ్ భయం




పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్సులో ఏకకాలంలో దాదాపు పన్నెండు జిల్లాల్లో బలూచ్ ఆర్మీ జరిపిన భీకరదాడుల్లో వందలాది ప్రాణాలు పోయాయి. 36మంది పౌరులు, 22మంది పాక్ భద్రతాసిబ్బంది ఈ దాడుల్లో మరణించారని, 19ప్తమంది బలూచ్ ఉగ్రవాదులను తాము మట్టుబెట్టామని పాక్ ప్రభుత్వం అధికారికంగా చెబుతున్నప్పటికీ, దాడుల తీవ్రత దృష్ట్యా సైనికుల మరణాలు అనేక రెట్లు ఉండవచ్చునని అంచనా. ఇప్పటికీ అక్కడక్కడ పరస్పరదాడులు జరుగుతున్నట్టుగా, ఇతర ప్రావిన్సులనుంచి వచ్చిన పాకిస్థానీలమీద స్థానికులు విరుచుకుపడు తున్నట్టుగా వార్తలు వెలువడుతున్నాయి. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)ను ఉగ్రవాద సంస్థగా గుర్తించిన నేపథ్యంలో, మంగళవారం ఐక్యరాజ్యసమితి కొన్ని పడిగట్టుపదాలతో ఈ ఘటనను ఖండించడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, బలూచ్ తిరుగుబాటు దారులను ఎదుర్కోవడం తమవల్ల కావడం లేదని పాకిస్థాన్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ జాతీయ అసెంబ్లీలో వ్యాఖ్యానించడం ద్వారా తమ పరువు తామే తీసుకున్నట్టు అయింది.విదేశీశక్తుల సాయంతోనే బలూచ్ ఆర్మీ రెచ్చిపోతోందని చెప్పుకోవడం పాక్ పాలకులకు క్షేమకరం. ఎవరో ఆర్థికసాయం చేస్తున్నారని, అత్యాధునిక ఆయుధాలు అందిస్తున్నారని అనడం ద్వారా తమ వైఫల్యాన్ని, నష్టాన్ని చక్కగా సమర్థించుకోవచ్చు. పాకిస్థాన్‌లోని అతిపెద్ద ప్రాంతంలో స్వల్పసంఖ్యలో ఉన్న ఈ టెర్రరిస్టుల దగ్గర ఒక్కొక్కటీ రెండుకోట్లు విలువచేసే అధునాతన రైఫిళ్ళు, మెషీన్‌గన్లు, నైట్‌విజన్ పరికరాలు, థర్మల్ వెపన్స్ వంటివి ఉన్నాయని, పాకిస్థాన్ సైన్యం దగ్గర ఆ స్థాయివి లేనేలేవని, అందువల్ల ఢీకొట్టడం కష్టమవుతోందని ఆయన వ్యాఖ్యల సారాంశం. బీఎల్ఏ నాయకత్వం అఫ్ఘానిస్థాన్‌లో ఉన్నదని, ఆయుధాలు అమెరికావని ఆయన మాట్లాడారు. రెబెల్స్ విరుచుకుపడుతూంటే పాక్ ఆర్మీ పరుగులు తీస్తోందని సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న ప్రచారం ఆయనను ఇబ్బంది పెట్టడం సహజం. తిరుగుబాటుదారుల దెబ్బకు పాక్‌సైనికులు మిలటరీ క్యాంపులు వదిలేసి పారిపోతున్నారంటూ ఖాళీగా ఉన్న ఆ స్థావరాలు, సైనికదుస్తులు, వివిధ పరికరాలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నాయి. సరైన సమన్వయంతో, ఏకకాలంలో, అనేక ప్రాంతాల్లో భయానక దాడులు జరిపి వందమందికి పైగా శత్రువులను మట్టుబెట్టామని బలూచ్ ఆర్మీ చెప్పుకుంటూంటే, పాక్ ఆర్మీ 'ఫిజికల్లీ హ్యాండీకాప్డ్' అయిపోయిందని స్వయంగా రక్షణమంత్రి చట్టసభలో అనడం విచిత్రం. బలూచ్ తిరుగుబాటుదారులకు భారత్ సహకరిస్తున్నదంటూ పాక్ పాలకులు విమర్శించడం, మనం ఖండించడం ఇప్పుడూ జరిగింది.ఇటీవలి కాలంలో బీఎల్ఏ ప్రతిఘటన స్థాయిలోనూ, తీవ్రతలో మార్పు వచ్చింది. పాక్ భద్రతాబలగాలను లక్ష్యంగా చేసుకొని రెబెల్స్ వివిధరకాల దాడులు చేస్తున్నారు. ఆత్మాహుతిదాడులు గతంలోనూ ఉన్నవే కానీ, మహిళలను అధికంగా వినియోగించడం పెరిగిందని అంటున్నారు. గతవారం జరిగిన దాడుల్లో ఇద్దరు మహిళలు ప్రధానపాత్ర పోషించారంటూ బలూచ్ ఆర్మీ వారి ఫోటోలను, వివరాలను, వీడియోలను సైతం విడుదల చేసి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. వనరులదోపిడీ, అణచివేతను ఎదుర్కోవడానికి తమవారు నవ్వుతూ ప్రాణాలు వదిలేస్తున్నారంటూ ఆ సంస్థ చెప్పుకుంటోంది.మొత్తం పాకిస్థాన్‌లో నలభైశాతం భూభాగం ఉన్న ఈ ప్రావిన్సుని ఎందుకు అదుపుచేయలేపోతున్నామో పాకిస్థాన్ పాలకులు ఆలోచించాలి. అత్యంత విలువైన ఖనిజ సంపదతోపాటు, చమురు, సహజవాయువు, బంగారం ఇత్యాది భారీ నిల్వలున్న ఈ ప్రాంతాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పాక్ పాలకులు ఆదినుంచీ వ్యవహరిస్తున్నారు. గనుల నిర్వహణతో పాటు, గ్వాదర్ నౌకాశ్రయాన్ని కూడా చైనా చేతుల్లో పెట్టి, అక్కడివరకూ చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను నిర్మించుకొనేందుకు అనుమతించి బలూచ్‌లను మరింత రెచ్చగొట్టారు. బలూచిస్థాన్‌ను బలవంతంగా విలీనం చేసుకున్న పాకిస్థాన్ దానిని ఎన్నడూ తనది అనుకోలేదు. పాక్షిక స్వయంపాలనకు సైతం అనుమతించకుండా, ప్రజలు ఎన్నుకున్నవారిని కూలదోసి, తమ అనుకూలురని ప్రతిష్ఠించి, సైన్యంతో దానిని ఏలేందుకు ప్రయత్నించడమే ఈ పరిస్థితికి కారణం. పదేళ్ళకాలంలో పదివేలమంది బలూచ్‌లను మాయం చేసిన ఘనత పాక్ పాలకులది. గత ఏడాది మార్చిలో ఏకంగా ఒక రైలునే హైజాక్ చేసిన బలూచ్ ఆర్మీ, ఇటీవలి దాడితో తన శక్తిసామర్థ్యాలు మరింత హెచ్చినట్టుగా ప్రపంచానికి చాటగలిగింది.

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్

**మొదటిపేజీ తరువాయి** – చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని అధికారులు సీఎంకు వివరించారు. వెంటనే వారిని మారేడుమిల్లి, రంపచోడవరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు.ఘటన జరిగిన వెంటనే హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను అంచనా వేశామని అధికారులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న మిగతా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, ఆహారం, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు వివరించారు. ఈ ఘటనపై విచారణకు ఒక జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## 1.25 కోట్ల మంది హిందువులు పోరాడాలని నిర్ణయించుకుంటే...!

**మొదటిపేజీ తరువాయి** – ఆయన స్పష్టం చేశారు.ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై, ముఖ్యంగా హిందువులపై దాడులు పెరిగాయని భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది జరిగిన 'జూలై తిరుగుబాటు', మాజీ ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతి తర్వాత ఈ హింస మరింత పెరిగిందన్నారు. ఈ దాడుల్లో ఎంతోమంది హిందువులు ప్రాణాలు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు.ఇదే సందర్భంగా భారత్‌పై కూడా భగవత్ మాట్లాడారు. దేశంలో జనాభా మార్పులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుంటోందని అన్నారు. "ఇప్పుడు భారత్‌ను ఎవరూ బలహీనపరచలేరు. దేశాన్ని విడగొట్టాలని చూసేవారే విడిపోతారు" అని ఆయన హెచ్చరించారు. సంఘ్ ఎవరికీ వ్యతిరేకం కాదని, అధికారం కోసం పనిచేయదని, మరెవరినో నడిపించే రిమోట్ కంట్రోల్ అంతకన్నా కాదని పునరుద్ఘాటించారు. సంఘ్ నిధులు స్వయంసేవకుల నుంచే వస్తాయని, ఆర్ఎస్ఎస్ చీఫ్ పదవికి కులంతో సంబంధం లేదని భగవత్ స్పష్టం చేశారు.

## మన సైన్యం దెబ్బతీసిన ఎయిర్ బేస్‌లో పాక్ మరమ్మతులు




**మొదటిపేజీ తరువాయి** – జరిపిన దాడిల్లో పాక్ లోని పలు ఎయిర్ బేస్ లు దెబ్బతిన్నాయి. ఇదే విషయాన్ని భారత్ ప్రపంచానికి వెల్లడించింది. పాక్ డ్రోన్ దాడులకు జవాబుగా మన వాయుసేన మే 10 న భొలారీ బేస్‌ను టార్గెట్ చేసి దాడులు జరిపింది.ఈ దాడిలో ఉపయోగించిన ఆయుధాల వివరాలను వెల్లడించనప్పటికీ.. ఎయిర్ బేస్ ను పాక్షికంగా దెబ్బతీశామని ప్రకటించింది. పాక్ మాత్రం ఈ వాదనను కొట్టిపారేసింది. అయితే, తాజాగా వెలుగుచూసిన ఉపగ్రహ చిత్రాల్లో భొలారి లోని పాక్ వాయుసేన స్థావరం దెబ్బతిన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాదు.. అందులోని దెబ్బతిన్న ఓ హ్యాంగర్ కు మరమ్మతులు చేయడం తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి 28న వాంటోర్ సంస్థకు చెందిన ఉపగ్రహాలు ఇక్కడ చిత్రాలను తీశాయి. ఆ సమయంలో ఎయిర్ బేస్‌లో దెబ్బతిన్న హ్యాంగర్‌కు పాక్ దళాలు మరమ్మతులు చేస్తున్నట్లు తేలింది.

## లడ్డు వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా మాట్లాడాలి



**మొదటిపేజీ తరువాయి** – ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. తిరుమల లడ్డులో కల్తీ జరిగిందన్న అంశంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిన విచారణలో, సీబీఐ సమర్పించిన నివేదిక వాస్తవాలను వెలుగులోకి తెచ్చిందని మంత్రి గుర్తుచేశారు. "60 లక్షల లీటర్ల నెయ్యిలో ఒక్క చుక్క కూడా అసలైన నెయ్యి లేదని నివేదిక స్పష్టం చేసిన తర్వాత కూడా వైసీపీ నాయకులు ఎదురుదాడి చేయడం దుర్మార్గం. వారికి ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు."అయోధ్యకు పంపిన లడ్డూల కోసం 'ప్రత్యేక నెయ్యి' వాడామని వైసీపీ నేతలు చెప్పడమే, తిరుమలలో వాడే నెయ్యి నాణ్యమైనది కాదని వారికి ముందే తెలుసనడానికి నిదర్శనం" అని మనోహర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్, పలమనేరు నుంచి ప్రత్యేకంగా నెయ్యి తెప్పించి అయోధ్యకు లడ్డూలు పంపామని చెప్పడం ద్వారా, ఐదేళ్లుగా మిగిలిన లడ్డూల తయారీలో ప్రజలను ఎలా మోసం చేశారో వారే అంగీకరించినట్టయిందని ఆయన విమర్శించారు.ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై వ్యక్తిగత దాడులుగా మలచాలని చూస్తున్నారని, సమాజం ఈ కుట్రను గమనించాలని కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచన ఎల్లప్పుడూ హిందూ ధర్మాన్ని కాపాడటమే తప్ప, ఇతర మతాలను కించపరచడం కాదని ఆయన స్పష్టం చేశారు. తప్పు జరిగిందని అంగీకరించి క్షమాపణ చెప్పాల్సింది పోయి, ప్రెస్ మీట్లు పెట్టి ఎదురుదాడి చేయడం వారి పైశాచిక ఆనందానికి నిదర్శనమని అన్నారు.ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా పరిగణించి, మఠాధిపతులు, పీఠాధి పతులు, ధార్మిక పెద్దలతో ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం ఉందని మంత్రి మనోహర్ అభిప్రాయపడ్డారు.

## "నామ్ నరేందర్... కామ్ సరెండర్"

**మొదటిపేజీ తరువాయి** – ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. ఇది 'గ్రేట్ డీల్' కాదని, భారతదేశానికి ఇదొక 'బ్లాక్ డీల్' అని అభివర్ణించారు. ప్రధాని మోదీ తీరు 'నామ్ నరేందర్.. కామ్ సరెండర్' (పేరు: నరేందర్... వృత్తి: లొంగిపోవడం) అన్నట్లుగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. అగ్రరాజ్యం బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి, ప్రధాని మోదీ దేశ ప్రజల ప్రయోజనాలను పూర్తిగా తాకట్టు పెట్టారని, ఆయన అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు.అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలు విధించడం ద్వారా భారత మార్కెట్లను వారికి అప్పగించడం, మన స్వదేశీ పరిశ్రమలకు, రైతాంగానికి మరణశాసనం రాయడమేనని షర్మిల దుయ్యబట్టారు."మన దేశ ఎగుమతులపై అమెరికా 18 శాతం సుంకాలు తగ్గిస్తే, వారి దిగుమతులపై మోదీ గారు సుంకాలు సున్నా చేయడం ఏంటి? మొన్నటిదాకా మన ఉత్పత్తులపై అమెరికా వేసిన పన్నులు 5 శాతం లోపే. ఇప్పుడు దాన్ని 50 శాతానికి పెంచి, అందులో 18 శాతం కుదిస్తే మనకు ప్రయోజనం ఎలా కలుగుతుంది? దీనివల్ల భారత్‌కు దక్కే ప్రయోజనం కంటే, సున్నా సుంకాలతో అమెరికాకు 100 శాతం లాభం చేకూరుతుంది" అని షర్మిల విమర్శించారు. ఇది భారత రైతుల మెడకు ఉరిపెట్టి, అమెరికా వ్యవసాయానికి మోదీ ఇచ్చిన గ్రేట్ డీల్ అని ఆమె మండిపడ్డారు.అధ్యక్షుడు ట్రంప్ కోసం ప్రధాని మోదీ "మేక్ ఇన్ ఇండియా" నినాదానికి తిలోదకాలు ఇచ్చారని షర్మిల ఆరోపించారు. "రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ తీసుకుంటే మళ్లీ సుంకాలు 50 శాతం పెంచుతామని ట్రంప్ బహిరంగంగా బెదిరిస్తుంటే ఇది బ్లాక్ మెయిల్ కాదా? ఆ భయంతోనే మోదీ సాగిలపడ్డారు," అని ఆమె వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాల మధ్య సమతూకంగా ఉండాలి కానీ, ఒక దేశానికి నష్టం, మరో దేశానికి లాభం చేసేవాటిని ఒప్పందాలు అనరని అన్నారు.75 ఏళ్ల భారత వాణిజ్య ఒప్పందాల చరిత్రను మోదీ తుంగలో తొక్కారని, 50 కోట్ల వ్యవసాయ ఆధారిత కుటుంబాల కన్నా అమెరికా ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమయ్యాయని విమర్శించారు. ఏటా 100 బిలియన్ డాలర్ల దేశ సంపదను అమెరికాకు అప్పనంగా కట్టబెట్టే కుట్రలో ఈ ఒప్పందం భాగమని ఆరోపించారు. భారత ప్రధాని విదేశం ఎదుట లొంగిపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ వెంటనే ఈ 'సరెండర్ అగ్రిమెంట్' పూర్తి వివరాలను బయటపెట్టాలని, కేవలం రెండు మూడు వస్తువుల గురించి కాకుండా అమెరికా నుంచి దిగుమతి కాబోయే అన్ని ఉత్పత్తులు, వాటిపై విధించే పన్నుల వివరాలను జాతికి తెలియజేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.



## ఉన్న జిల్లాలను తొలగించేది లేదు, కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేది లేదు



**మొదటిపేజీ తరువాయి** – లేదని ఉద్ఘాటించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజాప్రభుత్వం అధికారంలో ఉందని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయదని వెల్లడించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజాప్రభుత్వం అధికారంలో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయదని వెల్లడించారు.

**ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప ఉద్యమ నేత :** ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉందిని సీఎం పేర్కొన్నారు. దేశానికే నాయకత్వం వహించిన మాజీ ప్రధాని పీవీ ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహించారని ఆయన తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కీలక పాత్రపోషించిందని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప ఉద్యమ నేత అని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల ప్రత్యేకతను ఉద్యమంలో చూశామని వెల్లడించారు.

**ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడత :** 2004-14 మధ్య 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఎవరికైనా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు వచ్చిందా అని ప్రశ్నించారు. అయితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు మాత్రం ఫామ్‌హౌస్‌లు ఇచ్చాయని విమర్శించారు. కేసీఆర్‌కు పేదల పట్ల ఎలాంటి పట్టింపు లేదు అని పునరుద్ఘాటించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్ని బీఆర్ఎస్‌కు అని వారు అంటే ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్ని కాంగ్రెస్‌కు అని ఆనాడు చెప్పానని సీఎం పేర్కొన్నారు. అందుకే ప్రజలు కాంగ్రెస్‌కు గంపగుత్తగా ఓట్లు వేశారని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన ఇళ్లన్నీ నిర్మించుకొమ్మని అన్నారు. ఏప్రిల్ తర్వాత ఇందిరమ్మ ఇల్లు రెండోవిడత ఇస్తామని వెల్లడించారు.

**పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి :** దక్షిణ కుంభమేళాగా సమ్మక్క-సారలమ్మ జాతరను జరుపుకున్నామని సీఎం పెర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీఇచ్చారు. అటవీ ప్రాంతంలో రిసార్ట్‌లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

**ఈడీ కేసులతో అవమానిస్తున్నారు :** కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారని సీఎం పేర్కొన్నారు. కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి నేను ముఖ్యమంత్రినా అని కిషన్‌రెడ్డి చెప్తున్నారని తెలిపారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని సీబీఐ, ఈడీ కేసులతో అవమానిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈడీ, సీబీఐ కేసులతో రాహుల్‌గాంధీని వేధిస్తున్నారని తెలిపారు. కాళేశ్వరంలో అవినీతి చేసిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదని కేంద్రాన్ని నిలదీశారు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను కాపాడుతున్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేసే వరకు కిషన్‌రెడ్డి పేరు కిషన్‌రావే అని అన్నారు. కేసీఆర్‌కు దొంగ పుత్రుడు కేటీఆర్ దత్త పుత్రుడు కిషన్‌రెడ్డి అని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌తో బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితిఅని విమర్శల వర్షం కురిపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. బీజేపీ సాయానికి 8 ఎంపీ సీట్లను బీఆర్ఎస్ ఇచ్చిందిని చెప్పారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు బీఆర్ఎస్ సహాయపడుతోందన్నారు.

**ఏనాడైనా వచ్చారా? :** కేసీఆర్, మోదీని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్, బీజేపీ చెప్తున్నాయని సీఎం అన్నారు. మోదీ ఫొటో చూసి ఓటు వేయాలంటున్నారు గల్లీలో సమస్యలను మోదీ వచ్చి తీరుస్తారా అని ప్రశ్నించారు. పిల్లగాడిని చూసి పిల్లనిస్తారా, పెళ్లి పెద్దను చూసి పిల్లనిస్తారా? అంటూ విమర్శించారు. మనవారిని గెలిపిస్తే ఇక్కడే ఉంటూ మన పనులు చేస్తారని హామీ ఇచ్చారు. తన దగ్గరకు వచ్చి సంతకాలు పెట్టించుకునే చనువు మీ నాయకుడికి ఉంది అని పేర్కొన్నారు. ఏనాడైనా మోదీ భూపాలపల్లి వచ్చారా? అని అడిగారు. కేసీఆర్, మోదీని చూసి ఓటు వేస్తే మోసపోతారని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రెండేళ్లలో మున్సిపాల్టీలకు రూ.17,442 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ మున్సిపాల్టీలకే రూ. 6,016 కోట్లు కేటాయించామని వెల్లడించారు. కౌన్సిలర్ ఎవరో ఉంటే ఎమ్మెల్యేను అడగలేదన్నారు. ఎమ్మెల్యే సహకారం లేకపోతే తాను కూడా నిధులు ఇచ్చే పరిస్థితి ఉండదని తెలిపారు. ఇంటిల్లిపాదికి కేసీఆర్ పదవులు ఇచ్చారని విమర్శించారు. మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ భూపాలపల్లికి ఏమైనా చేశారా అని ప్రశ్నించారు."కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారు. కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి నేను ముఖ్యమంత్రినా అని కిషన్‌రెడ్డి చెప్తున్నారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని సీబీఐ, ఈడీ కేసులతో అవమానిస్తున్నారు. ఈడీ, సీబీఐ కేసులతో రాహుల్‌గాంధీని వేధిస్తున్నారు. కాళేశ్వరంలో అవినీతి చేసిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను కాపాడుతున్నది మీరు కాదా? కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేసే వరకు కిషన్‌రెడ్డి కిషన్‌రావే. కేసీఆర్‌కు దొంగ పుత్రుడు కేటీఆర్ దత్త పుత్రుడు కిషన్‌రెడ్డి. ఫోన్ ట్యాపింగ్‌తో బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్నారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి.

## యాసంగి రైతు భరోసాపై కీలక అప్‌డేట్



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ రైతులకు యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను అందించేందుకు ప్రభుత్వం భారీ కసరత్తు ప్రారంభించింది. నిధుల సమీకరణ కోసం బహిరంగ మార్కెట్ నుంచి ఏకంగా రూ.9,000 కోట్లు రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (ఆర్బీఐ) ఇండెంట్ సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రుణం సేకరించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.ఈ నెల 10వ తేదీన ఆర్బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సమీకరించనున్నారు. 13 ఏళ్ల కాలపరిమితితో రూ.2,000 కోట్లు, 16 ఏళ్లకు మరో రూ.2,000 కోట్లు, 21 ఏళ్ల కాలపరిమితితో రూ.2,500 కోట్లు, 27 ఏళ్లకు రూ.2,500 కోట్ల చొప్పున ప్రభుత్వం రుణం తీసుకోనుంది. ఈ-వేలం ప్రక్రియ పూర్తయిన తర్వాత నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరతాయి. అనంతరం రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించే అవకాశముంది. ఇప్పటికే యాసంగి సీజన్‌కు సంబంధించి అర్హులైన రైతుల జాబితా కూడా సిద్ధమైనట్లు సమాచారం.అయితే, ఈ నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే ఒక స్పష్టత ఇచ్చారు. మిర్యాలగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే రైతు భరోసా నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. దీంతో నిధుల సమీకరణ ప్రక్రియ పూర్తయినా, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది.తమ ప్రభుత్వం పార్టీలకతీతంగా, ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు. ఇప్పటికే పంట రుణాల మాఫీ కింద రైతులకు రూ.21 వేల కోట్లు అందించామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ కూడా ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

## నింగిలోకి 'రుద్రమ' రాకెట్!



**మొదటిపేజీ తరువాయి** – వరంగల్ చరిత్రలో తొలిసారిగా ఒక మోడల్ రాకెట్‌ను ప్రయోగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇస్రో స్పేస్ ట్యూటర్, ఏటీడీఆర్ఎల్ (అనిసియంట్ టెక్నాలజీస్ డిజైన్ అండ్ రీసెర్చ్ ల్యాబ్) వ్యవస్థాపకుడు శశాంక్ భూపతి నేతృత్వంలో ఈ ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్ నిట్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్నాయి.'రుద్రమ' అని నామకరణం చేసిన ఈ మోడల్ రాకెట్‌ను ప్రయోగించడానికి ముందు, హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో సైన్స్, అంతరిక్షంపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 28న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సు కొనసాగుతుంది. అనంతరం రాకెట్‌ను నింగిలోకి పంపిస్తారు.దీంతో పాటు, అంతరిక్ష వీక్షణపై ఆసక్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల 15 నుంచి 27 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భద్రకాళి ట్యాంక్‌బండ్‌పై టెలిస్కోపులతో నక్షత్ర వీక్షణ (స్టార్ గేజింగ్) కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు స్కూల్, కాలేజీ విద్యార్థులకు, ఆసక్తిగల వారికి ప్రవేశం ఉచితమని శశాంక్ తెలిపారు.

## ఒవైసీపై బండి సంజయ్ విమర్శనాస్త్రాలు



**మొదటిపేజీ తరువాయి** – నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ.. ఎప్పుడైనా ముస్లిం మహిళల సమస్యలపై ఓవైసీ మాట్లాడారా అని ప్రశ్నించారు. ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళలకు మేలు జరిగిందా లేదా అనే విషయంపై దమ్ముంటే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి ముస్లిం మహిళలకు భరోసా కల్పించిన పార్టీ బీజేపీయేనని స్పష్టం చేశారు. ట్రిపుల్ తలాక్ రద్దుకు ఎంఐఎం అనుకూలమా? వ్యతిరేకమా? చెప్పే ధైర్యం ఉందా? అంటూ ఓవైసీకి బండి సవాల్ విసిరారు. ఈ అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వైఖరిని కూడా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ తలాక్ రద్దును వ్యతిరేకిస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.పట్టణాల్లో అభివృద్ధి కేంద్ర నిధులతోనే సాధ్యమైందని బండి సంజయ్ పేర్కొన్నారు. గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణాలకు నయా పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. పొరపాటున కాంగ్రెస్‌ను గెలిపిస్తే మీ మెడలోని బంగారాన్ని కూడా కొట్టేస్తారని, పన్నుల మోతతో ప్రజల నడ్డి విరుస్తారని హెచ్చరించారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీజేపీ అభ్యర్థులు గుణవంతులని, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ధనవంతులని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా 20 సీట్లలోపే గెలుస్తాయని బండి సంజయ్ అన్నారు.

# తిరువూరు అభివృద్ధి దిశగా దూసుకెళ్తున్న నియోజకవర్గం



**తిరువూరు ఫిబ్రవరి 08 (వార్తసంధ్య)** : ప్రజల మనసుల్లో నిలిచిన నేత ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు యన్ టీ ఆర్ జిల్లా॥తిరువూరు తిరువూరు నియోజకవర్గం అంటే నేడు అభివృద్ధికి ప్రతీకగా మారింది అంటే అందుకు ప్రధాన కారణం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అంకితభావం, ప్రజాపక్షపాత పాలన అని చెప్పక తప్పదు. రాజకీయాల్లో విలువలు తగ్గిపోతున్న ఈ రోజుల్లోనూ ప్రజల సమస్యలను తనవిగా భావించి పనిచేస్తున్న నేతగా ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించారు.ఎన్నికల సమయ ంలో మాత్రమే కాదుఁ ఎప్పుడూ ప్రజల మధ్యే ఉండే నాయకుడు కొలికపూడి శ్రీనివాసరావు. గ్రామం ఏదైనా, కాలనీ ఏదైనా సమస్య విన్న వెంటనే స్పందించడం, అధికారులను రంగంలోకి దించి పరిష్కారం చూపించడం ఆయన పనితీరుకు నిదర్శనం. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్యం, విద్యఁ ఇలా ప్రతి రంగంలో తిరువూరులో కనిపిస్తున్న మార్పుకు ఆయన కృషి ప్రధాన కారణం.ప్రత్యేకంగా పేదలు, రైతులు, మహిళలు, యువత కోసం తీసుకున్న నిర్ణయాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పర్యవేక్షణ చేయడంలో ఆయన చూపిస్తున్న నిబద్ధత ప్రశంసనీయం. సమస్య చెప్పడానికి ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకునే ప్రజానాయకుడు అని తిరువూరు ప్రజలు గర్వంగా చెబుతుంటారు.రాజకీయ లాభనష్టాలకు అతీతంగాఁ నియోజకవర్గ అభివృద్ధే తన ఏకైక లక్ష్యం అన్నట్టుగా ముందుకు సాగుతున్న కొలికపూడి శ్రీనివాసరావు, తిరువూరు ప్రజలకు నిజమైన మార్గదర్శకుడిగా నిలిచారు.కష్టకాలంలో అండగా ఉండే నాయకుడిగా, అభివృద్ధి బాటలో ముందుండే శక్తిగా ఆయన పేరు నిలిచిపోయింది.అందుకే నేడు తిరువూరు నియోజకవర్గం అంటే అభివృద్ధి, సంక్షేమం, ప్రజాసేవ అనే మూడు మాటలు గుర్తుకు వస్తాయి. ఆ మూడు మాటల వెనుక నిలిచిన నాయకుడు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.

**రాజకీయాలు అంటే అధికారమో, పదవో కాదు**

**ప్రజల కన్నీళ్లను తుడిచే చేతే నిజమైన నాయకత్వం.**

**ఆ చేతే నేడు తిరువూరు నియోజకవర్గంలో**

**ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుగా కనిపిస్తోంది.**

ఎవరో ఒకరు సహాయం చేయాలనే ఆశతో ఎదురు చూస్తున్న పేద కుటుంబం దగ్గర నుంచిఁభూమి, పంటల సమస్యలతో అలమటిస్తున్న రైతు వరకుఁచదువుకోసం పోరాడుతున్న విద్యార్థి నుంచిఁఆసుపత్రి మెట్లెక్కే ధైర్యం లేని నిరుపేద వరకుఁప్రతి బాధకూ స్పందించే మనిషి ఆయన.

**పార్టీ చూసి కాదు**

**వర్గం చూసి కాదు**

**ఓటు వేశారా లేదా అన్న ప్రశ్న లేకుండా**

**మనిషి బాధే తన బాధగా భావించే మనసు ఆయనది.**

**రాత్రి, పగలు అనే తేడా లేకుండాఁఫోన్ మోగితే చాలు స్పందించే నాయకుడు కావడం**

**ఈ రోజుల్లో అరుదైన విషయం.**

అలాంటి అరుదైన నాయకుడు తిరువూరుకు దక్కడం ప్రజల అదృష్టం అని చెప్పాలి.

చిన్న చిన్న సమస్యలకైనా "నేనున్నాను" అని భరోసా ఇచ్చే తీరుఁఅది మాటల్లో కాదు, పనుల్లో కనిపించడం

అదే కొలికపూడి శ్రీనివాసరావు ప్రత్యేకత.రోడ్డు వేస్తే అభివృద్ధి అనుకోవచ్చుఁపథకాలు ఇస్తే ప్రభుత్వం అనుకోవచ్చు

కానీ బాధలో ఉన్న మనిషికి భరోసా ఇవ్వడం అనేది నాయకుడి హృదయం ఉన్నప్పుడే సాధ్యం.

అందుకే తిరువూరు నియోజకవర్గ ప్రజలు అంటారు...!

ఇదికదా ప్రజలతో నడిచే తీరు...తిరువూరు ప్రజలు అనుకునే పేరు.. మేము కొలికపూడి తాలూకా అని..

**రిపోర్టర్ సిరికొండ నాగేశ్వరరావు పొలిటికల్ స్టోరీ, తిరువూరు.**

# నకిరేకల్ నియోజకవర్గంలో కుమ్మర్ల సభ

**నకిరేకల్: ఫిబ్రవరి -08 (వార్త సంధ్య.) :** నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల స్థాయి సభను తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు."మట్టి పాత్రలు వాడాలి ప్లాస్టిక్‌ను నిషేధించాలి, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం, మానవ నాగరికతకు తొలి మెట్టు కుమ్మరి వృత్తి" అనే నినాదాలతో నకిరేకల్ టౌన్‌లో జనాకర్షణీయంగా ర్యాలీ నిర్వహించారు.అనంతరం కేతేపల్లి మండలం చీఎ-65 రోడ్డుపై (టోల్ గేట్ సమీపంలో) ఉన్న సందీప్ క్యాటరింగ్ హాల్‌లో సభ నిర్వహించారు.ఈ సభకు నిమ్మనగోటి వెంకన్న అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా పరిధిలోని ఆరు మండలాల్లో సంఘ నిర్మాణంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.చిట్యాల మండలంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి మండల అధ్యక్షులుగా పాకాల దినేష్ నార్కట్‌పల్లి మండలంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి మండల అధ్యక్షులుగా మిడిదొడ్డి రాజు ఎన్నుకున్నారు.కట్టంగూరు,నకిరేకల్, కేతేపల్లి,శాలిగౌరారం మండలాలకు మండల కన్వీనర్లను నియమించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికూడ జయంత్ రావు నాయకత్వంలో,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్ హాజరై మాట్లాడారు. గ్రామ కమిటీలు,మండల కమిటీలు బలోపేతం చేసి కుమ్మరి వృత్తిని ఆదర్శంగా నిలపాలని, రాబోయే రోజుల్లో బీసీ కులాలలో కుమ్మరి కులం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.రాజకీయ విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాచకొండ కృష్ణయ్య మాట్లాడుతూ,ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయంగా చైతన్యవం తమైందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కుమ్మరి కులానికి చెందిన సర్పంచులు,ఉపసర్పంచులు,వార్డు సభ్యులు గెలిచి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు.రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు డా. ఖమ్మంపాటి సత్యనారాయణ మాట్లాడుతూ, విద్య ఎంతో కీలకమని,పిల్లలను మంచి పాఠశాలల్లో చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ సభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం,జిల్లా కన్వీనర్ రాధారపు



బిక్షపతి,జిల్లా కో-కన్వీనర్ గంగాధరి వెంకటేశ్వర్లు,మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి జమ్మిశెట్టి వేణుగోపాల్, నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మన గోటి శ్యాం ప్రసాద్,జిల్లా సీనియర్ నాయకులు పోరండ్ల వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు తాడూరు చంద్రం, నిమ్మన గోటి సత్తయ్య, బొడ్డుపల్లి రమేష్, కాంశెట్టి శ్రీనివాస్, ఆమంచి వెంకటేశ్వర్లు,ఆమంచి శ్రీనివాస్,వృత్తిదారుల విభాగం అధ్యక్షులు ఆమంచి శరత్,ఉద్యోగ విభాగం అధ్యక్షులు చేతరాశిపల్లి రాము,కేతేపల్లి మండలం మాజీ అధ్యక్షులు సిలువేరు సైదులు,సూర్యాపేట జిల్లా టౌన్ అధ్యక్షులు సలిగంటి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.ఆరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కుమ్మరి కులస్తులు హాజరై నకిరేకల్ నియోజకవర్గంలో కుమ్మర్ల ఐక్యతను చాటి చెప్పారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి విషయంలో అపచారాలు చేయడం మంచిది కాదు

**తప్పు చేసిన వాళ్లు ఎంతటి వారైనా శిక్ష**
**అనుభవించక తప్పదని వెల్లంపల్లి హెచ్చరిక**

**అన్నమయ్య జిల్లా ప్రతినిధి - ఫిబ్రవరి 08 ( వార్త సంధ్య ) :** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో మరోసారి సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టింది. కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలపై మాజీ మంత్రి, వైసీపీ నేత వెల్లంపల్లి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని నిరూపించగలరా అంటూ ఆయన ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. ఆదివారం విజయవాడలో మీడియాలో మాట్లాడిన వెల్లంపల్లి శ్రీనివాస్, చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. సీబీఐ, సిట్ విచారణలో నిజాలు బయటపడినా ప్రభుత్వం ఇంకా బుకాయిస్తోందని ఆయన ఆరోపించారు.

**రిపోర్టులపై క్లారిటీ ఏది..**

సీబీఐ, సిట్ ఇచ్చిన నివేదికల్లో ఎక్కడా జంతువుల కొవ్వు ఆనవాళ్లు లేవని తేలిందని వెల్లంపల్లి పేర్కొన్నారు. "చార్జ్ షీట్‌లో కూడా యానిమల్ ఫ్యాట్ లేదని స్పష్టంగా ఉన్నప్పుడు, పవన్ కల్యాణ్ ఎందుకు అంత యాగీ చేశారని ప్రశ్నించారు. తప్పుడు ప్రచారంతో భక్తుల మనోభావాలను దెబ్బతీసినందుకు సీఎం చంద్రబాబు,






డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెంకటేశ్వర స్వామి భక్తులకు క్షమాపణ చెప్పాలని వెల్లంపల్లి డిమాండ్ చేశారు.

**కొత్త నాటకానికి తెరతీశారా..**

జంతువుల కొవ్వు అంటే ప్రజలు నమ్మడం లేదని గ్రహించి, ఇప్పుడు లడ్డూలో యాసిడ్లు కలిపారంటూ కొత్త ప్రచారానికి తెరతీశారని వెల్లంపల్లి మండిపడ్డారు. "తినే పదార్థాల్లో యాసిడ్లు కలిపితే ఏమవుతుందో మీకే తెలియాలంటూ ఎద్దేవా చేశారు. కొంత మంది జోకర్లు హిందూ ధర్మాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నారు. మీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే లారీలు వచ్చాయి. రిటర్న్ అయ్యాయి. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే చంద్రబాబు ఇలాంటి 'డైవర్షన్' రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

**అయోధ్య లడ్డూల గందరగోళం..**

అయోధ్యకు కల్తీ లడ్డూలు పంపారని ఆరోపించిన పవన్ కళ్యాణ్‌పై వెల్లంపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఆ లడ్డూలను ఎవరు తయారు చేశారు. ఎక్కడి నుంచి పంపారనే కనీస అవగాహన లేకుండా పవన్ మాట్లాడి అపహాస్యం పాలయ్యారని విమర్శించారు. వైసీపీ హయాంలో లడ్డూ నాణ్యతపై ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఆయన గుర్తు చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే కల్తీ నెయ్యి ట్యాంకర్లు వచ్చాయని, అవే ట్యాంకర్లు మళ్లీ లోపలికి వెళ్లాయని వెల్లంపల్లి ఆరోపించారు. దీనికి సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి విషయంలో అపచారాలు చేయడం మంచిది కాదని, తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని వెల్లంపల్లి హెచ్చరించారు. ఇప్పటికైనా అబద్ధపు ప్రచారాలు ఆపి, పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. రోజుకో రకంగా మాట్లాడే పవన్, నాగబాబును ఎవరు పట్టించుకోవటం లేదని శ్రీనివాసరావు వెల్లడించారు.

# చెన్నైలో జరిగిన వివాహానికి పలువురు సెలబ్రిటీలు హాజరు

**నూతన వధూవరులను ఆశీర్వదించిన - వైయస్ జగన్, స్టాలిన్**



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి - ఫిబ్రవరి 08 ( వార్త సంధ్య ) :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓ వివాహానికి చెన్నై కు చేరుకున్న విషయం తెలిసిందే. కాగా ఆదివారం కోలీవుడ్ స్టార్ హీరోలు సూర్య, కార్తీలు వైయస్ జగన్ ను మర్యాదపూర్వకంగా కలవడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. చెన్నైలో జరిగిన తన సోదరుడు వైఎస్ సునీల్ రెడ్డి కుమారుడు సాహిల్ వివాహ వేడుకకు జగన్ హాజరుకాగా ఈ వేడుకలో సూర్య మరియు కార్తీ కూడా పాల్గొనడంతో వారి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. ఈ వివాహ వేడుకలో జగన్ ఎంతో ఆత్మీయ పలకరింపుతో ఆలింగనం చేసుకొని సూర్య, కార్తీలతో ముచ్చటించారు. వారందరూ కలిసి నవ్వుతూ మాట్లాడుకుంటున్న వీడియోలు, ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అలాగే తమిళనాడు స్టాలిన్ వైయస్ జగన్ ను ఆత్మీయంగా పలకరించి ఆలింగనం చేసుకున్నారు. ఈ వివాహ మహోత్సవానికి పలువురు రాజకీయ ప్రముఖులు, సెలబ్రిటీలు పాల్గొన్నారు. మరో వైపు జగన్‌ను చూసేందుకు వివాహ వేడుక వద్ద అభిమానులు, వైసీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. స్థానిక ప్రజలు కూడా ఆయనతో ఫోటోలు దిగేందుకు ఆసక్తి చూపారు. ఫిబ్రవరి 8న జరిగిన సాహిల్ - వేదికల వివాహానికి జగన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాజకీయ ప్రముఖులు మరియు సినిమా స్టార్లు ఒకే వేదికపై ఇలా సందడి చేయడంతో అభిమానులు ఈ వీడియోని తెగ ట్రెండ్ చేస్తున్నారు. చెన్నైలో కూడా జగన్ హవా కనిపించింది. ఆయనను చూడటానికి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జగన్ బస చేసిన చెన్నై ఇళంబాక్కం సమీపంలోని వీజీపీ లేఅవుట్ లో ఉన్న అనిల్ రెడ్డి నివాసం వద్ద సందడి నెలకొంది. జై జగన్ అంటూ నినదించారు. జగన్ ప్లకార్డులను సైతం ప్రదర్శించారు. జగన్ ఒక రోజు ముందుగానే చెన్నై చేరుకున్నారు. వైఎస్ జగన్ వచ్చారనే సమాచారంతో తెలిసిన వెంటనే చెన్నైలో నివసిస్తున్న తెలుగు వారు, వైసీపీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో ఇళంబాక్కం నివాసానికి చేరుకున్నారు. తనను కలవడానికి వచ్చిన అభిమానులను జగన్ నిరాశ పర్చలేదు. చిరునవ్వుతో వారికి అభివాదం చేశారు. ఈ వివాహ మహోత్సవ కార్యక్రమానికి వై.వీ సుబ్బారెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి, మిథున్ రెడ్డి, సజ్జల రామకృష్ణ రెడ్డి, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, అనిల్, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇరవెండి లో మెగా రక్తదాన శిబిరం

**ఇరవెండి యువసేన మరియు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఏర్పాటుచేసిన తలసేమియా వ్యాధి గ్రస్తులకొరకు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం**

**బూర్గంపాడు, ప్రతినిధి, ఫిబ్రవరి 08 ( వార్త సంధ్య ) :** ఇరవెండి యువసేన మరియు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఏర్పాటుచేసిన తలసేమియా వ్యాధి గ్రస్తులకొరకు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా ఇరవెండి గ్రామపంచాయతీ సర్పంచ్ గుండి బాబురావు,ఉపసర్పంచ్ ల సంఘం జిల్లా అధ్యక్షులు మహంకాళి రామారావు ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినారు. సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ.. తన సేమియా అనేది ఒక జన్యుపరమైన వ్యాధి ఈ వ్యాధి వచ్చిన వాళ్లకి 15 నుండి 20 రోజుల కి ఒకసారి బ్లడ్ ఎక్కించాల్సి వస్తుంది లేనిచో వాళ్ళ ప్రాణానికి ప్రమాదం తలసేమియా వ్యాధి గ్రస్తులకొరకు రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఇరవెండి యువసేన,మరియు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వారిని అభినందనలు తెలియజేసారు.అలానే ఈ శిబిరం లో సిఆర్పిఎస్ కోబ్రా కానిస్టేబుల్ టీమ్ కూడా పాల్గొని రక్త దాన్నాని ఇచ్చారు వారికీ కూడా హృదయ పూర్వక అభినందనలు తెలియజెస్తున్నాం. ప్రాణాలు కాపాడే వారు డాక్టర్, రక్తాన్ని ఇచ్చి ప్రాణాలు కాపాడే రక్త దాతలు కూడా డాక్టర్ తొ సమానం అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో.. యువసేన సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# చారకొండమండలం. తుర్కలపల్లి గ్రామం నుండి జిల్లా స్థాయి కబడ్డీ లో సెలెక్ట్ అయి వెళ్తున్న బొడ్డు అనిల్



**అచ్చంపేట ప్రతినిధి, ఫిబ్రవరి 8 (వార్త సంధ్య) :** చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామం నుండి నాగర్ కర్నూల్ డిస్టిక్ కబడ్డీలో సెలెక్ట్ అయిన.బొడ్డు అనిల్‌కు ఉప సర్పంచ్ .బొమ్మకంటి కృష్ణయ్య సమక్షంలో సన్మానం చేయడం జరిగింది. మరియు ఉప సర్పంచ. కృష్ణయ్య మాట్లాడుతూ అనిల్ ఇంకా నువ్వు రాష్ట్ర స్థాయిలో వెళ్లాలని వారు కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎస్ కే నజరుద్దీన్. జోగు గణేష్ . మహేష్ కట్ట శివ లక్ష్మణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# కురుమ సంఘ భవనంలో ఉచిత మెగా వైద్యశిబిరం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**






**ఎల్బీనగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 8 (వార్త సంధ్య) :** గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని శ్రీ కోదండరాం నగర్ కాలనీ నందు గడ్డిఅన్నారం మున్సిపాలిటీ కురుమ సంఘం వారి సహకారంతో కురుమ సంఘ భవనంలో ఉచిత మెగా వైద్యశిబిరం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్.బి. నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పేద,మధ్య తరగతి ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు.హాస్పిటల్‌ను సందర్శించే రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు అందించాలని సూచించారు. కాలనీలోని ప్రజలకు షుగర్,బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,రమణ రెడ్డి,రాము,సన్ని యాదవ్,ప్రదీప్,విజయ,గడ్డిఅన్నారం కురుమ సంఘం అధ్యక్షులు బైర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ అభ్యర్థుల గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదు

**డబ్బు రాజకీయాలకు చెక్ పెడదాం**

**జనరంజక పాలనకు సిపిఐ అభ్యర్థులను గెలిపిద్దాం**

**ఇంటింటికీ చేరిన ఎర్రబాట ప్రచారం**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**




**కొత్తగూడెం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 08(వార్త సంధ్య) :** కొత్తగూడెం కార్పొరేషన్‌కు జరుగుతున్న పాలకవర్గం ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపుని ఏ శక్తి అడ్డుకోలేదని, డబ్బు రాజకీయాలకు ఈ ఎన్నికలు చెక్ పెట్టనున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కొత్తగూడెం పట్టణ పరిధిలోని 53, 59, 60, 15, 49 డివిజన్లలో జరిగిన ఇంటింటి ప్రచారం, రోడ్ షోల్లో పాల్గొన్నారు. ప్రధాన సెంటర్లలో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రత్యక్షమయ్యే నాయకులతో ప్రజలకు ఒరిగేదేమీలేదని, వారి మోసపూరిత మాటలు, శుష్కవాగ్దానాలు నమ్మి మోసపోవద్దన్నారు. వందేళ్లుగా ప్రజల మధ్యవుంది సేవలందిస్తున్న సిపిఐని ప్రజలు ఆదరించి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో మరింత అభివృద్ధిని సాధించుకునేందుకు విజ్ఞతతో ఓటు వేయాలన్నారు. జనరంజక పాలన సిపిఐతోనే సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అభ్యర్థులు బండి నర్సింహా, ఇమ్రాన్ మహమ్మద్, బేత అనంతలక్ష్మి, కనుకుంట్ల శాంతి, బోయిన విజయ్ కుమార్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నా వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి




**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 08 :** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటరమణ కాలనీలో కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి హాజరై శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, కర్మాంగట్ హనుమాన్ ఆలయం డైరెక్టర్ శ్రీమతి కవిత, అభ్యుదయ నగర్ కాలనీ అధ్యక్షులు గంగిరెడ్డి , గుంటి జంగయ్య కాలనీ వాసి ప్రకాష్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి సహకరిస్తున్న కార్పొరేటర్ కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ భవనం కాలనీలో సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు.అలాగే శ్రీ వెంకటరమణ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కాలనీవాసులు మరియు రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి కి ఘనంగా సన్మానం



**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 08 :** వనస్థలిపురం డివిజన్ క్రిస్టిన్ కాలనీలో కమ్యూనిటీ హాల్ పూర్తి సందర్భంగా ఘన సన్మానం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రిస్టిన్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తి కావడంతో, కాలనీవాసులు మరియు రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి కి ఘనంగా సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో క్రిస్టిన్ కాలనీ అధ్యక్షులు హరిందర్ రెడ్డి మాట్లాడుతూ, కార్పొరేటర్ తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ వంటి అనేక అభివృద్ధి పనులను విజయవంతంగా పూర్తి చేసి కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి తప్పకుండా మరోసారి గెలవాలని కాలనీవాసుల తరపున ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాషం అశోక్ గౌడ్ , కర్మాంగట్ హనుమాన్ ఆలయ డైరెక్టర్ శ్రీమతి కవిత,అభ్యుదయ నగర్ కాలనీ అధ్యక్షులు గంగి రెడ్డి, గుంటి జంగయ్య కాలనీ వాసి ప్రకాష్ పాల్గొని కార్పొరేటర్ కి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో భారీ సంఖ్యలో క్రిస్టిన్ కాలనీ వాసులు, రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేశారు.

## 14.00 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన - బి.యన్ రెడ్డి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 08 :** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బి.ఎన్.రెడ్డి నగర్ ఫేస్ 3 కాలనీలో 14.00 లక్షల రూపాయలతో నిర్మించనున్న సి.సి రోడ్లను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం కొరకు 14.00 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని అట్టి రోడ్లు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సాయి నికేతన్, ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి భరత్లాల్ రాథోడ్, ట్రెజరర్ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ సుమని నాయక్, విజయ్ కుమార్, కాలనీ సభ్యులు సత్యనారాయణ, మోహన్ రెడ్డి, యాదగిరిరావు, రవి ప్రకాష్, లింగం గౌడ్, భూషణ్, శ్రీనివాస్ గౌడ్, రాజు, భాను ప్రకాష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## సుభద్ర నగర్‌లో సీసీ రోడ్లను ప్రారంభించిన హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 08 :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సుభద్ర నగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత 5 సంవత్సరాలుగా డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి కాలనీకి అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. దెబ్బతిన్న రోడ్ల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారంగా సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని అన్నారు.ప్రతిరోజూ ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని వెంటనే స్పందించడం తమ కర్తవ్యమని, రాబోయే రోజుల్లో కూడా మరిన్ని అభివృద్ధి పనులతో సుభద్ర నగర్‌ను మరింత అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు.అదేవిధంగా స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మణ స్వామి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సుబ్రహ్మణ్యం, ఎం. కొండయ్య, ఫణి కుమార్, నర్సింహా మూర్తి, వెంకటేశ్వర్లు, (డి. నర్సింహా రావు)తాతలు,జి.ఎల్.ఆర్ ప్రసాద్, నిర్మల , బిజెపి సీనియర్ నాయకులు సంఘీ అశోక్, ఇట్టబోయిన నర్సింహా, ఎర్ర శ్రీకాంత్, మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనండి





**టేకులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 8 (వార్త సంధ్య) :** మోడి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై,బొగ్గుబావుల అమ్మకాలకు వ్యతిరేకంగా,ఉద్యోగ భద్రత,మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి గని కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఏరియా కోయగూడెం ఓపెన్ కాస్ట్ లో జరిగిన గేట్ మీటింగ్ లో మాట్లాడుతున్న జి ఎల్ బి కే ఎస్.. ఐ ఎఫ్ టి యు అధ్యక్షులు సాదినేని వెంకటేశ్వర రావు, కార్యక్రమంలో ప్రసంగించిన ఐఎన్ టియుసి భూక్యా నాగేశ్వరరావు,ఏఐటియుసి. అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిరియాలరంగయ్య ,సిఐటియు అధ్యక్షుడు మంద నరసింహారావు,టీబీజీకేఎస్ సంఘాల నాయకులు.కార్యక్రమంలో పాల్గొన్న జి ఎల్ బి కే ఎస్ జనరల్ సెక్రెటరీ జే సీతారామయ్య, రాష్ట్ర కోశాధికారి బయ్యా వరప్రసాద్,రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీనివాస్, రావూరి ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం




రాష్ట్ర పాలన, అభివృద్ధి లక్ష్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ సుదీర్ఘ సమీక్ష జరగనుంది. ఈ సమావేశానికి మంత్రులు, ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హాజరుకానుండగా, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ విధానంలో పాల్గొంటారు.ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు, పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రూపొందించిన పది సూత్రాల అమలు పురోగతిపై చర్చించనున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) వృద్ధి రేటును పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు.ఆదాయాన్ని ఆర్జించే శాఖల పనితీరు, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై కూడా ఈ సమావేశంలో సమీక్ష జరగనుంది. రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని సీఎం విశ్లేషించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా అవేర్, డేటా లేక్ వంటి వ్యవస్థల వినియోగం, పాలనలో కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్, ఇతర ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.వీటితో పాటు రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం, 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్ర ర్యాంకును మెరుగుపరచడం, శాంతిభద్రతల పరిస్థితిపై కూడా సమీక్షించనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖలు సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రులు, కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

## తనది తప్పని తేలితే ప్రభుత్వం విధించే ఎలాంటి శిక్షకైనా తాను సిద్ధమే.. హర్ష వీణ



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి - ఫిబ్రవరి 08 ( వార్త సంధ్య ) :** రైల్వేకోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ వ్యవహారం రోజురోజుకు మలుపులు తిరుగుతోంది. తాజాగా ఆదివారం బాధితురాలు హర్ష వీణ మరో సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. ఈ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకోవాలని మీడియా ద్వారా ఆమె బలంగా ఆకాంక్షిస్తున్నారు. ఈ వీడియో డిప్యూటీ సీఎం దృష్టికి వెళ్లేలా చూడాలని ఆమె మీడియాకు, ప్రజలను, సోషల్ మీడియా వేదికలను కోరారు. హర్షవీణ తన వీడియోలో స్థానిక జనసేన నాయకుడు తాతంశెట్టి నాగేంద్రపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్‌కు, తనకు మధ్య ఉన్న వ్యక్తిగత విషయాన్ని నాగేంద్ర అనవసరంగా రాజకీయం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. శ్రీధర్ వైపు న్యాయం లేదు. కాబట్టే నాగేంద్ర అసంబంధిత విషయాలను తెరపైకి తెస్తూ తనను ఇబ్బంది పెడుతున్నారని ఆమె మండిపడ్డారు. ఈ విషయంలో శ్రీధర్ తరపున ఆయన తల్లిదండ్రులు మాట్లాడాలని ఆమె డిమాండ్ చేశారు. అరవ శ్రీధర్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ప్రభుత్వ విప్‌గా ఉన్నందునే చట్టం నుండి తప్పించుకుంటున్నారని ఒకవేళ ఆయన సాధారణ వ్యక్తి అయ్యుంటే ఇప్పటికే రిమాండ్‌లో ఉండేవారని హర్షవీణ వ్యాఖ్యానించారు. అధికార బలంతో తనపై అన్యాయం జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను కూడా పవన్ కళ్యాణ్ పర్యవేక్షిస్తున్న శాఖలోనే ఉద్యోగిని అని గుర్తు చేస్తూ తన శాఖా మంత్రిగా ఆయన తనకు న్యాయం చేస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ వివాదానికి సంబంధించి పూర్తి వివరాలను పవన్ కళ్యాణ్‌కు స్వయంగా వివరించాలని ఆమె కోరుతున్నారు. ఒకవేళ విచారణలో తనది తప్పని తేలితే ప్రభుత్వం విధించే ఎలాంటి శిక్షకైనా తాను సిద్ధమని హర్షవీణ వాపోయింది. పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి తనకు అపాయింట్‌మెంట్ ఇచ్చి బాధితురాలిగా తన వాదనను వినాలని ఆమె వేడుకున్నారు.

## నేటితో ముగియనున్న ప్రచారం..

### క్లైమాక్స్‌కి చేరిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు..!
### కొత్తగూడెం కార్పొరేషన్‌లో రసవత్తర రాజకీయాలు
### కొత్తగూడెం గడ్డపై మొట్టమొదటి మేయర్ ఎవరు..?




**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 08 (వార్త సంధ్య) :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం నేటితో ముగియనుంది. ప్రచారానికి గడువు సాయంత్రం 5 గంటలతో ముగియనుండటంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. రోడ్ షోలు, వీధి సభలు, బహిరంగ సమావేశాలతో పార్టీలు చివరి క్షణం వరకూ ఓటర్లను ఆకట్టుకునేందుకు శ్రమిస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ అగ్రనేతలు రంగంలోకి దిగి ప్రచారాన్ని ఉధృతం చేశారు. ప్రచార పర్వం ముగియనున్న వేళ నేతల మాటలు తూటాల్లా పేలుతున్నాయి. అధికారం తమదేనని అన్ని పార్టీలు ధీమా వ్యక్తం చేస్తూ ఓటర్లను తమ వైపుకు మళ్లించుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే షబీర్ పాషా సైతం పార్టీ విజయంపై గట్టిగా ప్రచారం చేస్తున్నారు. ఇటు బీఆర్ఎస్ తరపున రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర గత మూడు రోజులుగా కొత్తగూడెంలో మకాం వేసి, కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. బీజేపీ, జనసేన అభ్యర్థులు కూడా పార్టీ బలం తక్కువగానే ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రచారాన్ని ఉధృతంగా కొనసాగిస్తున్నారు. ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌లో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? కొత్తగూడెం కార్పొరేషన్ కు మొట్టమొదటి మేయర్ పీఠాన్ని ఏ పార్టీ నుంచి ఎవరు అధిరోహిస్తారు? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠగా మారింది. ఫలితాల వరకు వేచిచూడాల్సిందే.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి - సిఐటియు



**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 08 వార్త సంధ్య :** జిల్లా పరిధిలోని వత్సవాయి, మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ సెంటర్ నందు ఆటో ఆటో స్టాండ్ నందు సమ్మె కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి,బి రాము మాట్లాడుతూ కార్మిక వర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు. అధిక పెనాల్టీ వేసే జీవో నెంబర్ 21న రద్దు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చేందుకు 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్తగా 4 లేబర్ కోడ్స్ తెచ్చింది. దేశంలో కోట్ల మంది ఉపాధి పొందుతున్న ట్రాన్స్పోర్టు రంగంలో ఎంవి యాక్ట్ సవరణ చట్టం ద్వారా ఓలా. ఊబర్ వంటి ప్రైవేటు, విదేశీ కంపెనీ సర్వీస్లకు దేశంలో అవకాశం కల్పించారు. సహజ వనరులైన ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను అంబాని, అదాని వంటి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ప్రైవేటు కంపెనీలు లాభాలే పరమావధిగా విపరీతంగా ఆయిల్ ధరలు పెంచుతున్నారు. ఫలితంగా ఆటో, ట్రాలీ ఆటో, టాటా ఏస్, గూడ్స్ ఆటోల మెయిన్టిటినెన్స్, స్పేర్పార్ట్స్ ధరలు, ఇన్సూరెన్స్ రేట్లు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆటోలకు కిరాయిలు లేక ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక వాహనాలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని.అంతేకాక ఆర్టిఓ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల వేధింపులు పెరిగాయి. జీఓ 21 తెచ్చి ఇ చలానాల పేరుతో వేల రూపాయలు జరిమానాలు విధిస్తున్నారు. అన్ని రకాల ఆర్టిఓ టాక్స్, లైసెన్స్, గ్రీన్ టాక్స్ , రోడ్ టాక్స్ పెంచుకుంటూ పోతున్నారు. మహిళలకు ఫ్రీ బస్ పథకం పెట్టిన తర్వాత ఆటో కార్మికుల కిరాయిలు తగ్గిపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారు. వృత్తి నుండి దూరమవుతున్నారు. వీరిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని.ఆటో డ్రైవర్లకు సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాలి. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్, యం.వి. యాక్టు సవరణ చట్టం రద్దు చేయాలి.భారీ పెనాల్టీలు విధించే జీఓ నెం. 21 రద్దు చేయాలి.ఆటో ఉపాధిని దెబ్బతీసే ఓలా. ఓబర్ వంటి విదేశీ, ప్రైవేటీ కంపెనీలకు అనుమతి రద్దుచెయ్యాలి.కేరళ రాష్ట్రంలో వలె ప్రభుత్వమే ఉచిత యాప్ పెట్టాలి.ఆటోల కొనుగోలుకు బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చెయ్యాలి.పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు జె.శ్రీను ఎం.శ్రీను, నరసింహారావు,గోపి, గోవింద్, రమేష్ , శ్రీనుమధు, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## తంగడపల్లి వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్ర మహోత్సవం మహా వైభవం

### 10 సంవత్సరాల నుండి అలంకరణ దాతగా ఎలిగేటి సురేందర్ రెడ్డి నిరంతర సేవలు
### గ్రామ పెద్దలు, భక్తులతో కిటకిటలాడిన స్వామివారి దేవస్థానం







**చేవెళ్ల ఫిబ్రవరి 8 (వార్త సంధ్య) :** రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం, తంగడపల్లి గ్రామంలోని దశావతార సహిత శ్రీ పద్మావతి అలమేలుమంగ సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాలు మహా వైభవంగా నిర్వహించారు. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర భాద్రపద శుద్ధ త్రయోదశి శుక్రవారం రోజున ఆలయం భక్తి పరిమళాలతో నిండిపోయింది.పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం శ్రీ విష్వక్సేనా ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, స్నపన తిరుమంజనం, అనేక నదీజలాలతో పాటు పంచామృతాలతో స్వామివారికి మహాభిషేకం నిర్వహించారు. అనంతరం యజ్ఞ కార్యక్రమం, ప్రత్యేక క్రతువులు ఘనంగా జరిగాయి. దశావతార సహితంగా, శ్రీ పద్మావతి అలమేలుమంగ సమేతంగా స్వామివారిని అద్భుతంగా అలంకరించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శన భాగ్యం పొందారు. ఆలయ ప్రాంగణమంతా "జై శ్రీమన్నారాయణఢ శ్రీనివాస పరబ్రహ్మణే నమః" నామస్మరణతో మార్మోగింది.ఈ మహోత్సవంలో గత 10 సంవత్సరాలుగా స్వామివారికి అలంకరణ దాతగా సేవలందిస్తున్న ఎలిగేటి సురేందర్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్వామివారి సేవను తన జీవిత ధ్యేయంగా భావిస్తూ నిరంతరం సేవలందిస్తున్న ఆయన భక్తిని గ్రామస్తులు, భక్తులు కొనియాడారు. స్వామివారి ఆశీస్సులతో సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షించారు. కృపతో భవిష్యత్తులో కూడా మరిన్ని ధార్మిక కార్యక్రమాలు చేపట్టాలనే సంకల్పంతో ఎలిగేటి సురేందర్ రెడ్డి ముందుకు సాగుతున్నారని ఆలయ వర్గాలు పేర్కొన్నారు.ఈ మహా వైభవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తంగడపల్లి గ్రామంలో నిర్వహించిన ఈ జన్మ నక్షత్ర మహోత్సవం భక్తి, సంప్రదాయం, సేవా భావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిందని భక్తులు అభిప్రాయపడ్డారు.

## నిత్యావసర వస్తువుల ధరలు మండుతున్న చోద్యం చూస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

### కాంగ్రెస్ నాయకుడు హైదరవల్లి





**అన్నమయ్య జిల్లా ప్రతినిధి - ఫిబ్రవరి 08 ( వార్త సంధ్య ) :** రాష్ట్రంలో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుకుంటున్నాయని సామాన్య ప్రజలు కొనలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నిరుపేద కుటుంబాలు పూట తిని మరో పూట పస్తుండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీ తంబళ్లపల్లె నియోజకవర్గం అధ్యక్షులు కాలసముద్రం హైదరవల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజానీకాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అధిక ధరలను నియంత్రించి ప్రజలను ఆదుకోవాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన ములకలచెరువు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రోజు రోజుకు అన్ని నిత్యావసర వస్తువుల ధరలు గగనానికి చేరుకోవడంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు పలు ఇబ్బందులకు లోనవుతున్నారని నిత్యవసర వస్తువుల నుంచి కూరగాయల వరకు ధరలు ఆకాశాన్ని అంటుకుంటున్న వీటి ధరలు నియంత్రించలేక కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తా ఉందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించలేదు. కానీ కూరగాయల ధరలు మండుతున్నాయి. నిత్యవసర వస్తువులు అయితే చెప్పనవసరమే లేదు. నిరుపేద కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అంతేకాకుండా బంగారు, ఎరువులు, క్రిమి కీటక మందులు, పాలు గుడ్లు, పండ్లు ఇలా ప్రతి ఒకటి రోజు రోజుకు ధరలు పెరుగుతున్న కూటమి ప్రభుత్వం ఏమి పట్టనట్టు వ్యవహరిస్తోంది. ప్రతిరోజు కూలి పనులు చేసుకుని జీవించే సామాన్య పేదరిక ప్రజలు అధిక ధరలు పెట్టి కొనుగోలు చేయలేక నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ప్రతి వస్తువుపై, ప్రతిరోజు తినే తిండి పై జీఎస్టీ సుంకం విధిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు దోచుకుంటున్నాయని మండిపడ్డారు. ధరలు నియంత్రించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటి గురించి పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాలు చూసుకుంటాయన్న ధోరణితో కేంద్ర ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆయా రాష్ట్రాల ప్రజలకు ఈ దుస్థితి నెలకొందన్నారు. గత కాంగ్రెస్ పార్టీ పాలనలో దేశంలో రాష్ట్రంలో ప్రజలపై పన్నుల భారం జీఎస్టీ లేకపోవడం, నిత్యవసర వస్తువుల ధరలు తక్కువగా ఉండడంతో ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడలేదని అయితే ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు కావాల్సిన అవసరాలు, అభివృద్ధి, పెరుగుతున్న ధరల గురించి పట్టించుకోకుండా పార్టీల అభివృద్ధి, స్వలాభాలను చూసుకుంటూ ప్రజలను గాలికొదిలేశారని ఆయన విమర్శించారు. ప్రతినిత్యం పెరుగుతున్న ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు పడుతున్న కష్టాలను గాలికొదిలేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అధిక ధరలను తగ్గించి ప్రజానీకాన్ని కష్టాల నుండి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ఆయనకు మద్దతు ప్రకటించారు.


# నెయ్యి కల్తీ నిజమే - కానీ నేరం నాది కాదు

**వైవీ సుబ్బారెడ్డి**

**సీఎఫ్‌టీఆర్ఐకి నెయ్యి శాంపిళ్లు పంపాలన్నది తానే అంటూ వివరణ**

**కానీ రిపోర్టు వచ్చిన విషయం మాత్రం తనకు తెలియదంటూ వ్యాఖ్యలు**

**కల్తీ నెయ్యి ఘటనపై టీటీడీ మాజీ ఛైర్మన్ చిలకపలుకులు**



తిరుమల లడ్డులో కల్తీ జరిగింది వాస్తవమేనని అందులో చాలా మంది వ్యక్తులు, అధికారుల ప్రమేయం ఉందని నాటి పాలక మండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పటం చర్చనీయాంశమైంది. నాలుగేళ్లపాటు టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నా కల్తీ నెయ్యి విషయం ఒక్కసారి కూడా ఆయన దృష్టికి రానేలేదనడం, కల్తీలో తన ప్రమేయం లేదనడం పులుకడిగిన ముత్యం అన్నట్టుగా అయన వ్యాఖ్యలు ఉన్నాయన్న వాదన వినిపిస్తోంది. నెయ్యిని రసాయనాలతో కల్తీ చేసినట్టు సిట్ చెప్పిందే తప్ప జంతు కొవ్వులు, చేప నూనె కలిసినట్టు ఎక్కడా చెప్పలేదని అడ్డగోలుగా బుకాయిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయన వాదన చూస్తుంటే హత్య చేసిన వ్యక్తి "హత్య జరగడం వాస్తవమే నేను కత్తితో పొడిచి చంపితే తుపాకీతో కాల్చారనడం తప్పు కదా' అని దబాయించినట్లుగా ఉందన్న వాదన వినిపిస్తోంది.'నెయ్యి కల్తీ జరిగింది. పామాయిల్, పామ్‌కెర్నల్ ఆయిల్, కొన్ని ఇతర పదార్థాలతో నెయ్యి కల్తీ చేశారని సిట్ నివేదికలో తెలిపింది. కల్తీ నెయ్యి సరఫరాలో చాలా మంది వ్యక్తులు, కొందరు అధికారుల ప్రమేయం ఉందని, బయటి వ్యక్తుల (థర్డ్ పర్సన్స్) పాత్ర ఉందని చెప్పింది. వారి పేర్లు ఛార్జిషీట్‌లో ప్రస్తావించింది' - దిల్లీలో విలేకర్లతో, ఒక ఇంగ్లిష్ ఛానల్‌తోనూ మాట్లాడుతూ వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలివి.తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ చేసి అడ్డంగా బుక్ అయినా నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మహా అపచారానికి పశ్చాత్తాపడకుండా బుకాయిస్తున్న తీరు విస్మయానికి గురి చేస్తోంది. నిబంధనలు సడలించి నాణ్యత పెంచామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. నిబంధనలు సడలించాకే భోలేబాబా డెయిరీ నకిలీ నెయ్యిని లక్షల కిలోలు సరఫరా చేసింది. సీ.ఎఫ్.టీ.ఆర్.ఐ నివేదికను తాను తొక్కిపెట్టానని ఘోరమైన అభియోగం చేస్తున్నారంటూ వైవీ సుబ్బారెడ్డి బుకాయిస్తున్నారు. నెయ్యి నాణ్యతపై నిజంగా సుబ్బారెడ్డికి శ్రద్ధే ఉన్నప్పుడు సీ.ఎఫ్.టీ.ఆర్.ఐకి పంపిన శాంపిళ్ల పరిస్థితేంటని అధికారుల్ని అడగకపోవటం ఏమిటనే ప్రశ్న తలెత్తుతుంది.

**భోలేబాబా డెయిరీకి లక్షల కిలోల సరఫరా:** కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారని పరీక్షల్లో నిర్ధారణైన తర్వాత కూడా భోలేబాబా డెయిరీకి లక్షల కిలోల సరఫరాకు 2022 ఆగస్టు 29న ఆర్డరు ఇవ్వటం, అక్టోబరు 28 వరకూ ఆ డెయిరీ నెయ్యి సరఫరా చేయటం వాస్తవం కాదా అనేది సుబ్బారెడ్డి ఎందుకు చెప్పటం లేదు? కారకులెవరనే దానికి సమాధానం లేదు? ల్యాబ్ రిపోర్టు చూపించి, ఆ డెయిరీల నుంచి ఎక్కువ కమీషన్లు దండుకోవడానికే ఆ పరీక్షలు చేయించారన్న ఆరోపణలకు అయన వద్ద జవాబే లేదు.చిన్నప్పన్న తన పీఏ కాదంటూ వైవీ మరో వితండవాదానికి దిగారు. సుబ్బారెడ్డి అండ లేకపోతే చిన్నప్పన్న లాంటి ఒక సాధారణ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి టీటీడీ ఇన్‌స్పెక్షన్ కమిటీని భోలేబాబా డెయిరీకి తనిఖీకి పంపించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించగలడా అనేది ప్రశ్న? ఆ డెయిరీ ప్రతినిధుల్ని దిల్లీ పిలిపించి కిలోకి 25 చొప్పున లంచం అడగటం, ప్రీమియర్ డెయిరీ నుంచి 50 లక్షలు లంచం ఎలా తీసుకోగలడో వైవీ సుబ్బారెడ్డి చెప్పాలి. అతని ఖాతాలోకి నాలుగున్నర కోట్లు ఎలా వచ్చాయో సమాధానం లేదు.

**సిట్ తేల్చినా వైవీ సుబ్బారెడ్డి అడ్డగోలు వాదనలు:** చిన్నప్పన్న పీఏ కాకపోతే అతను లంచం అడిగాడని భోలేబాబా డెయిరీ ప్రతినిధులు సుబ్బారెడ్డికి ఎందుకు ఫిర్యాదు చేశారు? దాన్ని ఆయన ఎందుకు తొక్కిపెట్టారనేది ప్రశ్న? నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదంటూ చేసే అడ్డగోలు వాదనకు ఎన్‌డీడీబీ నివేదిక సరైన సమాధానం ఇస్తుంది. ఎన్‌డీడీబీ రిపోర్టులో వెజిటబుల్ ఆయిల్స్‌తో పాటు, పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేపనూనె కలిసేందుకు అవకాశాలున్నాయని స్పష్టంగా పేర్కొంది. ల్యాబ్ రిపోర్టులు అంత స్పష్టంగా ఉంటే జంతువుల కొవ్వు కలవలేదని సిట్ క్లీన్‌చిట్ ఇచ్చినట్టుగా అడ్డగోలు వాదనేంటి అనే ప్రశ్న తలెత్తుతోంది.టీటీడీ పాలకమండలి వేదికగా స్వామివారి ఆర్జిత సేవల టికెట్ ధరల పెంపు ప్రతిపాదనను వేలం పాటలా మార్చేసిన తీరును లైవ్‌లో చూసిన జనం ఛీత్కరించుకున్నారు! ఇలాంటి ఘనకార్యాల్ని ప్రజలు చూస్తే బండారం బయట పడుతుందనుకున్నారో ఏమో ఆ తర్వాత ఇంకెప్పుడూ సమావేశాలను ప్రత్యక్షప్రసారం చేయలేదు. పాలకమండలి ఎజెండాను, నిర్ణయాల్ని టీటీడీ వెబ్‌సైట్‌లోనూ పెట్టడం మానేశారు. లైవ్ కొనసాగించి ఉంటే కల్తీ నెయ్యి సరఫరాకు రాచబాట పరిచిన సుబ్బారెడ్డి నిర్వాకాన్ని ప్రజలు అప్పుడే గుర్తించేవారేమో.?

# శ్రీనివాస మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**నేటి నుంచి 16వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు**

**ధ్వజారోహణ ఘట్టంతో ప్రారంభం**

**12న గరుడసేవ, 13న స్వర్ణరథోత్సవం, 15న రథోత్సవం, 16న చక్రస్నానం**

తిరుపతి శ్రీనివాస మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాకు తొలి అడుగు పడింది. ఆదివారం ఉదయం ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. దీనికిముందు ఉదయం 6.30 నుండి 8.15 గంటల వరకు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు.ఈ ఉత్సవం ద్వారా తన కోసం చేసిన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు పర్యవేక్షిస్తారు. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. మీన లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఇందులో వైఖానస శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి కొత్త వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు.18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. కంకణబట్టార్ బాలాజి రంగాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

**బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు :**

ధ్వజారోహణంతో వైభవంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని ఇటీవలే నియమితులైన టీటీడీ ఈవో రవిచంద్ర ఈటీవీ భారత్‌కు తెలిపారు. నేటి నుంచి 16వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 12న గరుడసేవ, 13న స్వర్ణరథోత్సవం, 15న రథోత్సవం, 16న చక్రస్నానం జరగనున్నట్టు వివరించారు. గరుడ సేవ రోజు భక్తుల రద్దీ నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.



**జూబ్లీహిల్స్‌లో బ్రహ్మోత్సవాలు:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల గోడ పత్రికలను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 17 నుంచి 25వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో బీ.ఆర్ నాయుడు గోడ పత్రికలను, ఆహ్వాన పత్రికలను శనివారం జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా అంచనా వేసి ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించినట్టు తెలిపారు. భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టాలని కోరారు. చలువ పందిళ్లు, క్యూ లైన్లు, తాగునీరు, అన్నప్రసాదాలు, పటిష్ట సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# పెళ్లిళ్ల సీజన్‌కు వేళాయే - బంగారం కొనగలమా!

**మాఘమాసం శుభ ముహూర్తాలతో జిల్లాల వ్యాప్తంగా సందడి వాతావరణం**

**బంగారం ఆభరణాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి**

**సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి**



ప్రస్తుతం మార్కెట్లో బంగారం, వెండి నువ్వా? నేనా? అన్నట్లు పరుగులు పెడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు వాణిజ్య మార్కెట్లలో హిటెక్కిస్తున్నాయి. రోజు రోజుకూ ధరలు వేల రూపాయల మేర పెరుగుతూ, తగ్గుతూ వస్తున్నాయి. రేపో మాపో ఇంకా తగ్గుతుందిలే అప్పుడు కొందాంలే అని ఎదురుచూస్తున్న వారికి నిరాశ తప్పడం లేదు. పెళ్లిళ్ల సీజన్ వేళ ధరలు పెరిగిన నేపథ్యంలో అమ్మకాలు ఎలా ఉండనున్నాయి. కొనుగోళ్లపై ప్రభావం చూపనున్నాయా? ఇవి రాబోయే 6 నెలలు ఏమేర వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయి? ఈ కథనంలో తెలుసుకుందాం.మాఘమాసం శుభ ముహూర్తాలతో సందడి వాతావరణం నెలకొంటుంది. ఈ మాసం శుభప్రదమైనది కావడంతో ఎక్కువగా శుభకార్యాలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, నిశ్చితార్థాలు ఇలా అన్నింటికీ మంచి రోజులు ప్రారంభం కానున్నాయి. రాబోయే 6 నెలల పాటు ముహూర్తాలు ఉండటం విశేషం. మరోవైపు చాతుర్మాసం, శూన్యమాసం వల్ల ఆగస్టు నుంచి అక్టోబరు వరకు శుభ ముహూర్తాలు లేవు. దీంతో మరో 3 నెలలు శుభకార్యాలకు బ్రేకులు పడనున్నాయి. మళ్లీ ముహూర్తాల కోసం నవంబరు, డిసెంబరు నెలల వరకు వచ్చి చూడాల్సిందే.ఈనెల 19 నుంచి పెళ్లి బాజాలు మోగనున్నాయి. మరోవైపు శివరాత్రి, ఉగాది పండగలు సైతం కావడంతో బంగారం, వెండి ఆభరణాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వీటి ధరల విషయానికి వస్తే గత 3 రోజుల వరకు తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఈ ధరలు పెరగడంతో దేశీయంగా ఈ మార్పులు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పసిడి, వెండి కొనుగోలు చేయొచ్చా? లేదా? అనే సందేహాలతో కొందరూ ఆందోళన చెందుతున్నారు. మరికొందరూ పెరుగుతున్న ధరల దృష్ట్యా కొనుగోలు పరిమాణాలను తగ్గించుకుంటున్నారు. తేలికైన ఆభరణాలకై మొగ్గు చూపుతున్నారు.పెళ్లిళ్ల సీజన్ వేళ - బంగారం ధరలు, అమ్మకాలు: అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు పెరగడం, రూపాయి విలువలో మార్పులు, పెట్టుబడుల ఆసక్తి వంటి కారణాలతో దేశీయంగా కూడా ధరలు అధికమయ్యాయి. ఒకప్పుడు బంగారం ధర పెళ్లి బడ్జెట్‌లో పెద్దగా ఇబ్బంది కలిగించేది కాదు. కానీ ఇప్పుడు అదే ధర సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారుతోంది. దీంతో ముందుగా ప్లాన్ చేసుకున్న పరిమాణంలో కాకుండా అవసరమైనంత మాత్రమే కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది.పెళ్లిళ్ల ముహూర్తాలు ఖరీరైన వేళ బంగారం పూర్తిగా కొనుగోలు చేయడం ఆపడం లేదు. అయితే బంగారం బరువులో మాత్రం కోత పెడుతున్నారు. భారీ ఆభరణాలు బదులు తక్కువ గ్రాముల డిజైన్ జ్యూయలరీ, లైట్ వెయిట్ నగల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇక మరోవైపు పాత బంగారం మార్పిడికి డిమాండ్ పెరుగుతుంది. ఇంట్లో ఉన్న పాత ఆభరణాలను ఇచ్చి కొత్తవి తీసుకునే వారి సంఖ్య పెరగడంతో నగదు భారం కొంత తగ్గుతోంది. తద్వారా జ్యువెలరీ షాపులకు కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది.పెళ్లిళ్ల సీజన్ వేళ బంగారం డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. దీంతో ధరలు అమాంతం పెరగనున్నాయి. గత కొద్ది రోజులుగా ధరలను పరిశీలస్తే మళ్లీ రికార్డు స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నట్లు కనిపిస్తున్నాయి. ఈ పెరుగుదల వినియోగదారులను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పెళ్లిళ్ల సీజన్ వేళ మార్కెట్ ధరలు సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి తీసుకురానున్నాయి.ధరలు పెరిగినా భారతీయ వివాహాల్లో బంగారానికి ఉన్న ప్రాధాన్యం తగ్గే అవకాశాలు తక్కువే. అయితే అమ్మకాల విలువ పరంగా తగ్గుదల లేకపోయినా, అమ్ముడయ్యే బంగారం పరిమాణం మాత్రం కొంత తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తంగా ఈసారి పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం అమ్మకాలు కొనసాగినా, ధరల ప్రభావంతో కొనుగోలు ధోరణిలో స్పష్టమైన మార్పు కనిపించనుంది.

# వంద కోట్ల భూమిని కాపాడిన హైడ్రా.. ఎక్కడంటే!

**అమీన్ పూర్ లోని చక్రపురి లేఔట్ లో అక్రమాలు**

**రోడ్లు, పార్కు స్థలాల ఆక్రమణ.. బుల్డోజర్లతో హైడ్రా తొలగింపు , స్థానికుల ఫిర్యాదుతో చర్యలు**

హైదరాబాద్ లోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా అధికారులు తాజాగా వంద కోట్ల విలువైన నాలుగు ఎకరాల స్థలాన్ని కాపాడారు. ఆక్రమణలు కూల్చివేసి కబ్జాదారుల చెర నుంచి విలువైన భూమిని విడిపించారు. అమీన్ పూర్ లోని చక్రపురి లేఔట్ లో రోడ్లు, పార్కు స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఈరోజు ఉదయం బుల్డోజర్లతో అమీన్ పూర్ చేరుకున్న అధికారులు.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చివేశారు.పోలీస్ సిబ్బంది బందోబస్తుతో రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా అధికారులు మొత్తం 15 జేసీబీలతో ఆక్రమణలు తొలగించారు. దీంతో పాటు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా దూలపల్లి విలేజ్‌లోని సుమారుకుంటలో, నాగారం రామకృష్ణ నగర్ కాలనీలోని శివాలయానికి చెందిన 1,365 గజాల స్థలాన్ని, యూసుఫ్గూడలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది.



# గొలుసు దొంగగా మారిన బిజినెస్ మ్యాన్.. పట్టిచ్చిన షూస్

**సంపన్న కుటుంబంలో పుట్టి చైన్ స్నాచర్ గా మారిన వైనం**

**ఆన్ లైన్ జూదం వ్యసనంతో అప్పులపాలైన బిజినెస్ మ్యాన్**

**అప్పులు తీర్చేందుకు దొంగతనాలు చేస్తున్నట్లు వెల్లడి**




సంపన్న కుటుంబంలో పుట్టినా చెడు అలవాట్ల వల్ల ఓ యువకుడు అప్పుల పాలయ్యాడు.. అప్పులు తీర్చేందుకు చైన్ స్నాచర్ గా మారి మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులు ఎత్తుకెళ్లాడు. ఎప్పటికప్పుడు దుస్తులు మార్చేసి పోలీసులకు దొరకకుండా తప్పించుకోవాలని ప్రయత్నించాడు. దుస్తులు మార్చినా కూడా తను వేసుకున్న షూ మార్చకపోవడంతో పోలీసులకు దొరికిపోయాడు. ముంబైలో వరుస దొంగతనాలకు పాల్పడిన ఓ చైన్ స్నాచర్ ను అతడు వేసుకున్న షూ పట్టించాయి.వివరాల్లోకి వెళితే.. ముంబైలోని సియాన్ ఏరియాకు చెందిన మోహన్ కొకాటే గతంలో గార్డెనింగ్ వ్యాపారం చేస్తుండేవాడు. ఆయన కుటుంబంలో అందరూ ఉన్నత విద్యావంతులే.. పెద్ద పెద్ద హోదాలో ఉన్నవారే. మోహన్ మాత్రం ఆన్ లైన్ జూదానికి బానిసయ్యాడు. జూదం ఆడేందుకు విపరీతంగా అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు చైన్ స్నాచర్ అవతారమెత్తాడు. గతంలోనూ మోహన్ కు నేరచరిత్ర ఉంది. 2011లో జైలుకు కూడా వెళ్లాడు. బయటికి వచ్చాక కొంతకాలం నేరాలకు దూరంగా ఉన్నప్పటికీ అప్పుల కారణంగా మరోమారు దొంగగా మారాడు.దొంగిలించిన బైక్ పై ప్రయాణిస్తూ మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులు ఎత్తుకెళ్లాడు. ముఖానికి హెల్మెట్ ధరించడం, ఎప్పటికప్పుడు దుస్తులు మార్చడంతో మోహన్ ను గుర్తించడం పోలీసులకు సవాలుగా మారింది. దొంగతనాలు జరిగిన ప్రాంతాల్లోని 80 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా.. దొంగతనం జరిగిన ప్రతిచోటా దొంగ వేర్వేరు దుస్తుల్లో కనిపించాడు. అయితే, అన్నిచోట్లా ఒకే రకమైన షూ ధరించాడు. ఈ క్లూ ఆధారంగా పరిశోధన జరిపిన పోలీసులు.. దొంగిలించిన బైక్ ను వదిలించుకునేందుకు ప్రయత్నిస్తుండగా మోహన్ ను గుర్తించి అరెస్టు చేశారు.


# ప్రియురాలితో వీడియో కాల్‌లో మాట్లాడుతూ బాలుడి బలవన్మరణం

**ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్న యువకుడు**

**విషయాన్ని అతడి స్నేహితులకు తెలియజేసిన అమ్మాయి**

**ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థి**

**తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



ప్రియురాలితో వీడియో కాల్ మాట్లాడుతూ 17 ఏళ్ల బాలుడు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం బోడుప్పల్ అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో నివసించే ఓ ప్రైవేటు ఉద్యోగి కుమారుడు స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చదువుతున్నాడు. ప్రస్తుతం మేడిపల్లిలోని ఓ కార్ల షోరూమ్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ తీసుకుంటున్నాడు.ఈ నెల 5వ తేదీ రాత్రి బాలుడి తల్లిదండ్రులు షాపింగ్ కోసం బయటకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న అతడు, తాను ప్రేమించిన అమ్మాయికి వీడియో కాల్ చేశాడు. ఆమెతో మాట్లాడుతూనే చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఈ ఘటనతో ఆందోళనకు గురైన ఆ యువతి వెంటనే అతడి స్నేహితులకు సమాచారం అందించింది.స్నేహితులు హుటాహుటిన బాలుడి ఇంటికి చేరుకుని, అప్పటికే ఉరి వేసుకుని ఉన్న అతడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# ఓఆర్ఆర్‌పై ఏప్రిల్ 1 నుంచి నగదు చెల్లింపులు బంద్.. పెరగనున్న టోల్ చార్జీలు!

**ఏప్రిల్ 1 నుంచి ఓఆర్ఆర్‌పై పూర్తిగా క్యాష్‌లెస్ లావాదేవీలు**

**టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపుల విధానం రద్దు**

**ఫాస్టాగ్ లేనివారు యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించవచ్చు**

**రెండేళ్ల తర్వాత టోల్ చార్జీలను పెంచేందుకు సన్నాహాలు**

**2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త రేట్లు అమల్లోకి వచ్చే అవకాశం**





హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రయాణికులకు ముఖ్య గమనిక. ఏప్రిల్ 1 నుంచి ఓఆర్ఆర్‌పై ఉన్న అన్ని టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నారు. ఇకపై ఫాస్టాగ్ లేదా యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా మాత్రమే టోల్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. జాతీయ రహదారులపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్యాష్‌లెస్ విధానాన్ని అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నారు.ప్రస్తుతం ఫాస్టాగ్ ఉన్న వాహనాలు ఆటోమేటిక్‌గా స్కాన్ అవుతుండగా, ఫాస్టాగ్ లేనివారు నగదు చెల్లించే అవకాశం ఉంది. ఏప్రిల్ 1 నుంచి ఈ నగదు విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నారు. అలాంటి వారు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపులు చేయవచ్చు. ఓఆర్ఆర్‌పై పెద్ద అంబర్‌పేట్, మేడ్చల్, కోకాపేట, శంషాబాద్‌తో సహా మొత్తం 19 ఇంటర్‌ఛేంజ్ టోల్ ప్లాజాలను హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) నిర్వహిస్తోంది.నగదు నిర్వహణ, రవాణా, భద్రపరచడం వంటి సమస్యలతో పాటు చిల్లర విషయంలో ప్రయాణికులకు, సిబ్బందికి మధ్య తరచూ వాగ్వాదాలు జరుగుతున్నాయని హెచ్‌జీసీఎల్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత లోపించడం, దొంగతనాల వంటి భద్రతాపరమైన సమస్యలను అధిగమించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

**రెండేళ్ల తర్వాత టోల్ రేట్ల పెంపు**

మరోవైపు ఓఆర్ఆర్‌పై టోల్ చార్జీలను కూడా 2026 ఏప్రిల్ 1 నుంచి పెంచే అవకాశం ఉంది. చివరిసారిగా 2024 ఏప్రిల్‌లో టోల్ రేట్లను సవరించారు. వివిధ కారణాల వల్ల 2025 ఏప్రిల్‌లో పెంపును చేపట్టలేదు. దీంతో రెండేళ్ల విరామం తర్వాత సవరించిన టోల్ రేట్లు అమల్లోకి రానున్నాయని అధికారులు తెలిపారు. దీనిపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.

## ఖర్జూరం, పాలు 15రోజులు తాగండి చాలు.. ఈ సమస్యలకి దూరంగా ఉండండి!



మీరు ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవాలనుకుంటే, సాదా పాలకు బదులుగా ఖర్జూరంతో మరిగించిన పాలు తాగడం అలవాటుగా చేసుకోండి.. ఖర్జూరం పాలు రుచికరమైనవి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా అద్భుతమైనవి. ఎందుకంటే రెండూ పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. కలిపి తీసుకుంటే వాటి ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. ఖర్జూరంలో ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. మరోవైపు, పాలలో ప్రోటీన్, కాల్షియం, విటమిన్ డి, బి12 ఉంటాయి. ఇవి శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మీరు ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవాలనుకుంటే, సాదా పాలకు బదులుగా ఖర్జూరంతో మరిగించిన పాలు తాగడం అలవాటుగా చేసుకోండి.. ఖర్జూరం పాలు రుచికరమైనవి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా అద్భుతమైనవి. ఎందుకంటే రెండూ పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. కలిపి తీసుకుంటే వాటి ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. ఖర్జూరం పాలు ఎలా తయారు చేయాలి?..ఉపయోగాలేంటో పూర్తి వివరాల్లోకి వెళితే? పాలల్లో ఖర్జూరం కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి ఎన్నో లాభాలు ఉన్నాయంటున్నారు పోషకాహార నిపుణులు. ఇవి మీకు తక్షణ శక్తిని అందిస్తుంది. వీటిలోని సహజమైన షుగర్ ఇన్?స్టాంట్ ఎనర్జీని ఇస్తాయి. ఎముకల బలానికి మంచిది. వీటిలో మినరల్స్, పొటాషియం, కాపర్, మెగ్నీషియం ఎముకల బలానికి మేలు చేస్తాయి. జీర్ణ సమస్యలు దూరమవుతాయి. మలబద్ధకం తగ్గుతుంది. గట్ హెల్త్? మెరుగవుతుంది. బీపీని కంట్రోల్?లో ఉంచడంలో హెల్ప్ చేస్తుంది. కాబట్టి రక్తపోటుతో ఇబ్బంది పడేవారు హాయిగా తీసుకోవచ్చు. బీపీని కంట్రోల్?లో ఉంచడంలో హెల్ప్ చేస్తుంది. కాబట్టి రక్తపోటుతో ఇబ్బంది పడేవారు హాయిగా తీసుకోవచ్చు. బరువు పెరగడంలో హెల్ప్ చేస్తుంది. రెండిటీలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. ఆరోగ్యకరంగా బరువు పెరుగుతారు. దీనికోసం ముందుగా 1 గ్లాసు పాలు తీసుకోండి. 3 నుంచి 5వరకు ఖర్జూరాలను సగానికి కోసి విత్తనాలను తొలగించండి. పాలలో ఖర్జూరాలు వేసి కొన్ని నిమిషాలు మరిగించాలి. గోరువెచ్చగా ఉండగానే తాగేయాలి. మీరు దానిని రాత్రంతా అలాగే ఉంచి ఉదయం ఖాళీ కడుపుతో కూడా తీసుకోవచ్చు. ఖర్జూరం పాలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాల: బలహీనతను అధిగమించడానికి, శక్తిని తిరిగి పొందడానికి మీరు ఖర్జూర పాలను తీసుకోవచ్చు. ఖర్జూరంలోని సహజ చక్కెర అలసటను తగ్గిస్తుంది. అయితే పాలు దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి.ఖర్జూరాలు ఇనుముకు మంచి మూలం. రక్తహీనతతో బాధపడేవారు పాలలో మరిగించిన ఖర్జూరాన్ని త్రాగాలి. ఇది హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడానికి సహాయపడుతుంది.

## ఉప్పు, జామకాయ కలిపి తింటున్నారా?




జామ మీ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి జీర్ణక్రియను మెరుగుపరచడం, మీ చర్మాన్ని మెరిసేలా చేయడం వరకు అనేక విధాలుగా మేలు చేస్తుంది. జామకాయలో ఆపిల్ కంటే 10 రెట్లు ఎక్కువ ప్రోటీన్, మూడు నారింజల కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. చాలా మంది ఆరోగ్యకరమైన జామకాయలను ఉప్పుతో తింటారు. విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉన్న జామకాయ ప్రయోజనాలు దాని రుచిని మించి ఉంటాయి. దాని తీపి, ఉప్పగా ఉండే రుచితో జామ మీ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి జీర్ణక్రియను మెరుగుపరచడం, మీ చర్మాన్ని మెరిసేలా చేయడం వరకు అనేక విధాలుగా మేలు చేస్తుంది. జామకాయలో ఆపిల్ కంటే 10 రెట్లు ఎక్కువ ప్రోటీన్, మూడు నారింజల కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. చాలా మంది ఆరోగ్యకరమైన జామకాయలను ఉప్పుతో తింటారు. ఇలా తినటం సరైనదేనా..? జామకాయను ఉప్పుతో ముఖ్యంగా నల్ల ఉప్పు, లేదా రాతి ఉప్పుతో కలిపి తినడం వల్ల దాని ప్రయోజనాలు పెరుగుతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అదనపు విటమిన్ సిని అందిస్తుంది. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. ఉప్పు జామ రుచిని పెంచడమే కాకుండా ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేస్తుంది. అయితే, మీకు అధిక రక్తపోటు ఉంటే, తక్కువ ఉప్పును వాడండి. జామకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది నల్ల ఉప్పుతో కలిపితే మలబద్ధకం, ఆమ్లత్వం, ఉబ్బరం నుండి ఉపశమనం కలిగిస్తుంది. కాబట్టి, కడుపు సమస్యలను తగ్గించడానికి, మీరు ఖచ్చితంగా జామకాయను నల్ల ఉప్పుతో తినాలి. జామపండ్లలో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఉప్పు ద్రవ సమతుల్యతకు కూడా సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తికి గొప్ప కలయికగా మారుతుంది. జామపండ్లలోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ (ఒఆఒ), రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ఉప్పు ఎలక్ట్రోలైట్ సమతుల్యతకు సహాయపడుతుంది. జామపండ్లలోని ఫైబర్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి. జామపండ్లకు ఉప్పు వేసుకోవడం వల్ల అదనపు రుచితో పాటు అనే ప్రయోజనాలను పొందవచ్చు. ఉప్పు జామ రుచిని పెంచుతుంది. జామలోని ఫైబర్ మీకు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది బరువు నియంత్రణకు సహాయపడుతుంది.

## రోజుకు ఒకటి రెండు తింటే గుండెపోటుకు చెక్.!



ఇందులో పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, అలాగే వివిధ రకాల యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అయితే చాలా గింజలు సంతృప్త కొవ్వులను కలిగి ఉంటాయి. అందుకే వాల్‌నట్స్‌ను ఆరోగ్యకరమైనవిగా పరిగణిస్తారు. వాల్‌నట్స్ తినడం వల్ల చాలా అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయి.. వాల్‌నట్స్ అన్ని డ్రై ఫ్రూట్స్‌లో అత్యంత శక్తివంతమైనవిగా చెబుతుంటారు. వాల్‌నట్స్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండెపోటు, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించవచ్చని అనేక అధ్యయనాలు చూపిస్తున్నాయి. అందువల్ల శరీరాన్ని ఆరోగ్యంగా, బలంగా ఉంచడానికి డ్రై ఫ్రూట్స్‌ను ఆహారంలో చేర్చుకోవాలంటున్నారు వైద్య నిపుణులు. వాల్‌నట్స్ ఆరోగ్యంపై ప్రభావం చాలా శక్తివంతమైనది. ప్రతి డ్రై ఫ్రూట్ దాని ప్రయోజనాలను కలిగి ఉన్నప్పటికీ, వాల్‌నట్స్ వాటిలో అత్యంత శక్తివంతమైనవి. అలాగే ఆరోగ్యకరమైనవి. వాల్‌నట్స్‌లో పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, అలాగే వివిధ రకాల యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అయితే చాలా గింజలు సంతృప్త కొవ్వులను కలిగి ఉంటాయి. అందుకే వాల్‌నట్స్‌ను ఆరోగ్యకరమైనవిగా పరిగణిస్తారు. వాల్‌నట్స్ తినడం వల్ల చాలా అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయి. మెదడు: వాల్‌నట్స్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడు కణాల పెరుగుదలకు, న్యూరాన్‌ల మధ్య మెరుగైన జరిగే ప్రక్రియకు సహాయపడతాయి. వాల్‌నట్స్‌ను క్రమం తప్పకుండా తినడం వల్ల జ్ఞాపకశక్తితో పాటు ఆలోచన మెరుగుపడుతుంది.ఒత్తిడిని తగ్గిస్తుంది: ఒత్తిడితో బాధపడేవారికి వాల్‌నట్స్ తినడం చాలా ప్రయోజనకరం. వాల్‌నట్స్‌లో ట్రిప్టోఫాన్ అనే రసాయనం ఉంటుంది. ఇది స్థిరమైన మానసిక స్థితిని కాపాడుకోవడానికి సహాయపడే సెరోటోనిన్ అనే హార్మోన్‌ను పెంచే అమైనో ఆమ్లం. దీని ప్రకారం.. ప్రతిరోజూ వాల్‌నట్స్ తినడం వల్ల ఒత్తిడి, ఆందోళన, నిద్ర సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. గుండెకు మంచిది: వాల్‌నట్స్ తినడం గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. వాల్‌నట్స్‌లో పాలీఫెనాల్స్, ఫైబర్ ఉంటాయి. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వాల్‌నట్‌లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. బరువు తగ్గడం: బరువు తగ్గాలనుకునే వారికి వాల్‌నట్స్ తినడం కూడా ప్రయోజనకరం. వాల్‌నట్స్‌లో ఫైబర్, ప్రోటీన్ పుష్కలంగా ఉంటాయి. ఇది మీ కడుపు ఎక్కువసేపు నిండిన అనుభూతిని ఉంచడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో తినడం: వాల్‌నట్‌లను ముందు రోజు రాత్రి నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే ఖాళీ కడుపుతో వాటిని తినడం వల్ల వాల్‌నట్‌లోని పోషకాలు మీ శరీరంలోకి బాగా చేరుతాయి. వివిధ రకాల డ్రై ఫ్రూట్స్‌లో వాల్‌నట్‌లను తినడం ఆరోగ్యానికి మంచిది. అయితే, ఎక్కువగా తినడం వల్ల శరీరంలో సమస్యలు వస్తాయి. మీరు ప్రతిరోజూ ఒకటి లేదా రెండు వాల్‌నట్‌లను తినవచ్చు.

## రోజూ వాడే ఉప్పు గురించి ఎవరికీ తెలియని నిజం!



స్వచ్ఛమైన ఉప్పుకు గడువు తేదీ ఉండదు, కానీ ప్యాకెట్లపై కనిపించే తేదీ అయోడిన్, యాంటీ-కేకింగ్ ఏజెంట్ల ప్రభావం తగ్గడాన్ని సూచిస్తుంది. తేమ, గాలి తగలడం వల్ల అయోడిన్ పోషక విలువ క్షీణిస్తుంది, ఉప్పు ముద్దలుగా మారుతుంది. గడువు ముగిసినా, సరిగ్గా నిల్వ చేస్తే ఉప్పు సురక్షితమే; దాని పోషక విలువ మాత్రమే తగ్గుతుంది. గాలి చొరబడని కంటైనర్లలో నిల్వ చేయడం ఉత్తమం. వంటగదిలో అతి ముఖ్యమైన పదార్థం ఏది అంటే.. అందరూ ఠక్కున చెప్పే సమాధానం ఉప్పు అని. ఎందుకంటే? ఉప్పు లేకుండా ఏ వంటకం రుచికరంగా ఉండదు. కూర ఎంత మంచిదైనా చిటికెడు ఉప్పు లేకపోతే, ఆహారం తినకూడనిదిగా ఉంటుంది. అందుకే ఉప్పు లేని కూర వృధా అనే సామెత ఉంది. రుచిలో మాత్రమే కాకుండా ఆహారాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉంచడంలో కూడా ఉప్పు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అయితే, మనం ప్రతిరోజూ ఉపయోగించే ఈ ఉప్పుకు గడువు తేదీ ఉంటుందా..? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. మార్కెట్‌లో లభించే ఉప్పు ప్యాకెట్లపై గడువు తేదీని చూసి చాలా మంది అయోమయానికి గురవుతారు. నిజానికి స్వచ్ఛమైన ఉప్పు అంటే సోడియం క్లోరైడ్. ఇది ప్రకృతిలో త్వరగా చెడిపోదు. ఉప్పు తేమను ఆకర్షిస్తుంది. ఇది బ్యాక్టీరియా, సూక్ష్మజీవుల పెరుగుదలను తగ్గిస్తుంది. అయితే, మనం ఉపయోగించే టేబుల్ సాల్ట్ కేవలం ఉప్పు మాత్రమే కాదు. దానిలో అయోడిన్ కూడా కలుపుతారు. శరీరానికి అవసరమైన అయోడిన్‌ను అందించడానికి ఈ పద్ధతిని అవలంబిస్తారు. కాలక్రమేణా గాలి, వెలుతురు తగిలితే, అయోడిన్ కంటెంట్ తగ్గుతుంది. అందుకే తయారీదారులు ప్యాకెట్‌పై గడువు తేదీని సూచిస్తారు. దీని అర్థం ఉప్పు చెడిపోతుందని కాదు, కానీ, దాని పోషక విలువ తగ్గుముఖం పడుతుందని మాత్రమే సూచిస్తుంది. మరో కారణం కూడా ఉంది. ఉప్పు గాలి నుండి తేమను త్వరగా ఆకర్షిస్తుంది. దీనివల్ల అది గట్టిపడి రాతి ముక్కలుగా మారుతుంది. ఈ సమస్యను నివారించడానికి, యాంటీ-కేకింగ్ ఏజెంట్లు అనే పదార్థాలు కలిపి తయారు చేస్తారు. కొంతకాలం తర్వాత ఇవి వాటి ప్రభావాన్ని కోల్పోతాయి. అప్పుడు ఉప్పు ముద్దలుగా మారుతుంది. ఇది కేవలం నాణ్యత, వాడుకలో సౌలభ్యం విషయం మాత్రమే. కాబట్టి, గడువు ముగిసిన ఉప్పు దొరికితే, దానిని వెంటనే పారవేయాల్సిన అవసరం లేదు. అది పొడిగా, వాసన లేనిదిగా, కలుషితం కాకపోతే దానిని ఉపయోగించవచ్చు. అయితే, అయోడిన్ కంటెంట్ తక్కువగా ఉండవచ్చు. అందుకే గాలి చొరబడని కంటైనర్‌లో, తేమ లేని ప్రదేశంలో ఉప్పును నిల్వ చేయడం సరైన పద్ధతి. సరిగ్గా నిల్వ చేస్తే, ఉప్పును చాలా కాలం పాటు సురక్షితంగా ఉపయోగించవచ్చు.

# రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగుతాయ్- కానీ!

**రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించనున్న భారత్**

**కానీ కొన్ని దిగుమతులు కొనసాగుతాయ్**

సుంకాలను తగ్గించేందుకు అమెరికా అంగీకరించినందుకు ప్రతిగా, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ క్రమంగా తగ్గించే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి. అయితే ప్రస్తుతానికి రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు కొనసాగుతాయని తెలుస్తోంది. భారత్‌లోని నయారా ఎనర్జీ లాంటి చమురు రిఫైనరీలకు ఇతర ప్రత్యామ్నాయాలు లేనందున, రష్యా నుంచి అవి చమురు దిగుమతిని కొనసాగిస్తాయని సమాచారం. ఈ రిఫైనరీలు ముడి చమురును శుద్ధి చేసి పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలుగా మారుస్తుంటాయి. రష్యా నుంచి ముడి చమురును కొనడం ఆపేయండి అంటూ ఇప్పటివరకు భారత్‌లోని రిఫైనరీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ఆదేశాలు అందలేదని తెలిసింది. అయితే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను క్రమంగా తగ్గించమని అన్ని రిఫైనరీలకు అనధికారిక సూచనలు చేశారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ముడి చమురు కోసం రిఫైనరీలు సగటున 6 నుంచి 8 వారాలు ముందే ఆర్డర్లు ఇస్తుంటాయి. ఈవిధంగా ఇచ్చిన ముందస్తు ఆర్డర్ల ప్రకారం రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను భారత రిఫైనరీలు తప్పకుండా కొనసాగిస్తాయని తెలిసింది. కానీ ఇకపై కొత్త ఆర్డర్లు ఇవ్వడం ఆపేస్తాయని అంటున్నారు.

**రష్యా చమురు వర్సెస్ భారత రిఫైనరీలు**

రష్యాకు చెందిన ప్రధాన చమురు ఎగుమతి కంపెనీలపై 2025లో అమెరికా ఆంక్షలు విధించగానే భారత్‌లోని పలు రిఫైనరీలు అలర్ట్ అయ్యాయి. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్), మంగళూర్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ (ఎంఆర్‌పీఎల్), హెచ్‌పీసీఎల్ - మిట్టల్ ఎనర్జీ (హెచ్ఎంఈఎల్) రిఫైనరీలు వెంటనే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేశాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) లాంటి రిఫైనరీలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొంతమేర తగ్గించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ సైతం గత సంవత్సరం మొదటి పది నెలల పాటు పెద్ద మొత్తంలో రష్యా చమురును కొనుగోలు చేసింది. అయితే 2025 నవంబరు 20 నుంచి అధికారికంగా రష్యా చమురును కొనడం ఆపేసింది. రష్యా చమురు ఎగుమతి కంపెనీలు రోస్ నెఫ్ట్, లూక్ ఆయిల్‌లపై అమెరికా ఆంక్షలు విధించాక రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త అప్‌డేట్ ఏమిటంటే, రానున్న కొన్ని వారాల్లో రష్యా నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు దాదాపు 1.50 లక్షల




బ్యారెళ్ల ముడి చమురు అందనుంది. ఆ తర్వాత పూర్తిస్థాయిలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆపేసే ఛాన్స్ ఉందని అంచనా వేస్తున్నారు.

**ఒక్క 'నయారా'కు మినహాయింపు ఇస్తారా?**

గుజరాత్‌లోని వాదినార్ కేంద్రంగా పనిచేసే నయారా ఎనర్జీ రిఫైనరీకి రష్యా తప్ప మరో దిక్కు లేదు. నయారాలో 49.13 శాతం వాటా రష్యా కంపెనీ రోస్ నెఫ్ట్ చేతిలో ఉంది. ఈ కారణంతో నయారాపై యూరోపియన్ యూనియన్ (ఈయూ), బ్రిటన్ ఆంక్షలు విధించాయి. ఈ ఆంక్షలకు భయపడి నయారాకు ముడి చమురుకు సప్లై చేసేందుకు ఏ దేశాలూ ముందుకు రావడం లేదు. ఈ అనివార్య పరిస్థితుల్లో రష్యా నుంచే ముడి చమురు కొనుగోళ్లను నయారా ఎనర్జీ కొనసాగించాల్సి వస్తోంది. ప్రస్తుతానికి అమెరికా ఆంక్షలు విధించని రష్యా చమురు ఎగుమతి కంపెనీల నుంచి ఆయిల్‌ను నయారా కొంటోంది. 2025 డిసెంబరులో వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా జరిపిన చర్చల్లోనూ తమ రిఫైనరీ ప్రస్తావన వచ్చిందని నయారా అధికార వర్గాలు తెలిపాయి. రష్యా చమురు కొనుగోళ్లను ఆపే నిబంధన నుంచి తమ రిఫైనరీకి ప్రత్యేక మినహాయింపు లభిస్తుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. రానున్న కొన్ని వారాల పాటు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత రిఫైనరీలు కొనసాగించేందుకు ఉన్న అవకాశాలపై స్పందించేందుకు భారత చమురు శాఖ నిరాకరించింది. ముడి చమురును కొనే విషయంలో నయారా ఎనర్జీకి రష్యా మినహా ప్రత్యామ్నాయ మార్గాలేవీ లేవనే అంశంపైనా భారత వాణిజ్య శాఖ కానీ, విదేశాంగ శాఖ కానీ అధికారిక ప్రకటనేదీ విడుదల చేయలేదు.

**రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గుముఖం**

రష్యా కంపెనీలు రోస్ నెఫ్ట్, లూక్ ఆయిల్‌లపై అమెరికా ఆంక్షలు అమల్లోకి వచ్చాక, రష్యా చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా తగ్గించిందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. 2025 డిసెంబరులో ప్రతిరోజు సగటున 1.2 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును భారత్ కొనుగోలు చేసింది. అంతకుముందు 2023 మే నెలలో రోజుకు 2.1 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును భారత్ కొనేది. ఇక 2026 జనవరి నెలలో రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల కంటే తక్కువ చమురును రష్యా నుంచి భారత్ కొనుగోలు చేసింది. అమెరికా విధించిన తాజా షరతు ప్రకారం, ఇకపై రష్యా నుంచి చమురు కొనుగోళ్లను సగానికి సగం భారత్ తగ్గించే సూచనలు ఉన్నాయని అంటున్నారు. 2022 ఫిబ్రవరిలో రష్యా - ఉక్రెయిన్ యుద్ధం మొదలైంది. అప్పటి నుంచి రష్యాపై అమెరికా, ఐరోపా దేశాలు ఆంక్షల పర్వాన్ని కొనసాగిస్తున్నాయి. అయినప్పటికీ 2025 సంవత్సరం చివరి వరకు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ కొనసాగించింది. సాధారణం కంటే చౌక ధరలకే రష్యా ముడి చమురును భారత్ రిఫైనరీలు కొనుగోలు చేశాయి. కాగా, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేందుకు భారత్ అంగీకరించిందని ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు ప్రతిగా భారత వస్తు, ఉత్పత్తులపై గతంలో విధించిన 25 శాతం సుంకాన్ని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

**జులై వరకు భారత్‌కు రష్యా చమురు సప్లై కొనసాగొచ్చు**

"భారత్ - అమెరికా ట్రేడ్ డీల్ ఫలితంగా, వెంటనే రష్యా చమురు సప్లైలను భారత్ ఆపేసే అవకాశాలు లేవు. రానున్న 8 నుంచి 10 వారాల పాటు రష్యా నుంచి భారత్‌కు భారీగా ముడి చమురు సప్లై జరిగే ఛాన్స్ ఉంది. ఆ చమురు అందడం భారతదేశ రిఫైనరీల వ్యవస్థకు చాలా కీలకం. భారత రిఫైనరీలకు చాలా చౌకగా రష్యా చమురు లభిస్తోంది. ఈ సంవత్సరం జులై నెలవరకు రష్యా నుంచి భారత్‌కు చమురు సప్లైలు నిలకడగానే ఉండొచ్చు. కొంతకాలం పాటు రష్యా చమురు సప్లైలను భారత్ ఆపకపోవచ్చు" అని వాణిజ్య వ్యవహారాల పరిశీలక సంస్థ కెప్లర్‌కు చెందిన నిపుణుడు సుమిత్ రితోలియా అంచనా వేశారు.

# ఐపీవోకి మెడికవర్ హాస్పిటల్స్.. రూ.250 కోట్లతో హైదరాబాద్‌లో మరో రెండు దవాఖానలు




సూపర్-స్పెషాల్టీ హెల్త్‌కేర్ సేవల సంస్థ మెడికవర్ హాస్పిటల్స్..హైదరాబాద్‌లో మరో 2 హాస్పిటల్స్‌ను ప్రారంభించబోతున్నది. రూ.100 కోట్లతో సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన దవాఖానను ఈ నెల 16న, రూ.150 కోట్లతో కోకాపేట వద్ద ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్ ఈ ఏడాదిచివరినాటికిఅందబా టులోకి రానున్నట్టుకంపెనీచైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కృష్ణ తెలిపారు. హైదరాబాద్, సెప్టెంబర్ 15 : సూపర్-స్పెషాల్టీ హెల్త్‌కేర్ సేవల ప్రారంభించబోతున్నది. రూ.100 కోట్లతో సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన దవాఖానను ఈ నెల 16న, రూ.150 కోట్లతో కోకాపేట వద్ద ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్ ఈ ఏడాదిచివరినాటికిఅందు బాటులోకి రానున్నట్టు కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కృష్ణ తెలిపారు. దీంతో అదనంగా 800 పడకలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ పెట్టుబడులను అంతర్గత వనరుల ద్వారా, ఆర్థిక సేవల సంస్థల వద్ద రుణాలు తీసుకున్నట్టు చెప్పారు. వ్యాపార విస్తరణకు అవసరమైన నిధులను సేకరించడానికి వచ్చే ఏడాది ఐపీవోకి రానున్నట్టు ఆయన ప్రకటించారు. ఎంతమేర సేకరించేదానిపై ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. మౌలిక సదుపాయాల కల్పనకోసం, రుణాలను తగ్గించుకోవడానికి ఐపీవో ద్వారా సేకరించిన నిధులను వినియోగించనున్నట్టు ఆయన ప్రకటించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1,850 కోట్లుగా నమోదైన టర్నోవర్, ఈసారి రూ.2 వేల కోట్లు అధిగమించనున్నదన్నారు. తెలంగాణతోపాటు ఏపీ, బెంగళూరు, పూణెలలో 23 హాస్పిటల్స్ ఉండగా, పడకల కెపాసిటీ 5,750 ఉన్నది. చిన్న నగరాలపై దృష్టిప్రస్తుతం మెట్రో నగరాల్లో దవాఖానాలను ఏర్పాటు చేసిన సంస్థ..సమీప భవిష్యత్తులో ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఇందుకోసం ఆయా నగరాల్లో చిన్న స్థాయి హాస్పిటల్స్‌ను కొనుగోలు చేసే ఆలోచన కూడా ఉన్నదని, ప్రస్తుతం ఈ విషయంపై ప్రధానంగా దృష్టి సారించినట్టు చెప్పారు. ఇదే క్రమంలో చందానగర్‌లో ఉన్న ఆసుపత్రి సామర్థ్యాన్ని మరో 150 పడకలు పెంచుతున్నట్టు తెలిపారు. హాస్పిటల్ రంగం పలు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నదని, ముఖ్యంగా క్లినికల్ ప్రతిభ ఉన్నవారు చాలా తక్కువ స్థాయిలో ఉన్నారని, దీనికి తోడు హెల్త్‌కేర్ ఖర్చులు అధికం కావడం, అంతర్జాతీయ స్థాయిలో కరెన్సీలు తీవ్ర ఆటుపోటులకు గురికావడం, టారిఫ్‌లు, నూతన మెడికల్ టెక్నాలజీ పరికరాలకోసం అధికంగా నిధులు వెచ్చించాల్సి వస్తున్నదన్నారు

# సాఫ్ట్‌వేర్ టు హార్డ్‌వేర్.. రూటు మార్చిన దేశీయ ఐటీ రంగ సంస్థలు దేశీయ ఐటీ రంగ సంస్థలు..

**చిప్, ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి**

**ఆయా సంస్థలతో కలిసి ప్రాజెక్టులకు సై**

సాఫ్ట్‌వేర్ నుంచి హార్డ్‌వేర్ వైపునకు అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే దాదాపుగా బడా కంపెనీలన్నీ వ్యూహాత్మకంగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ ప్రాజెక్టుల దిశగా వెళ్తున్నాయి. తద్వారా భారత్‌లో చిప్స్ తయారీకి పెద్ద ఎత్తున ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని చూస్తున్నాయి. దేశీయ ఐటీ రంగ సంస్థలు.. సాఫ్ట్‌వేర్ నుంచి హార్డ్‌వేర్ వైపునకు అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే దాదాపుగా బడా కంపెనీలన్నీ వ్యూహాత్మకంగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ ప్రాజెక్టుల దిశగా వెళ్తున్నాయి. తద్వారా భారత్‌లో చిప్స్ తయారీకి పెద్ద ఎత్తున ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని చూస్తున్నాయి. దీంతో ఇంజినీరింగ్, రిసెర్చ్, డెవలప్‌మెంట్ కోసం వివిధ సంస్థలతో కలిసి భారీగా పెట్టుబడులకూ ప్రముఖ ఐటీ కంపెనీల యాజమాన్యాలు సిద్ధమవుతున్నాయి. ఆయా సంస్థల్లో వాటాలనూ దక్కించుకుంటున్నాయి. ఇదీ సంగతి..నిజానికి గత కొన్నేండ్ల నుంచే సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోకి ఐటీ కంపెనీలు వస్తున్నాయి. అయితే ఇటీవలికాలంలో అవి విస్తరణ బాట పట్టడం గమనార్హం. ఇక నిరుడు రూ.1.26 లక్షల కోట్ల విలువైన సెమీకండక్టర్ ప్లాంట్ల ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినదీ విదితమే. హర్మన్స్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్ బిజినెస్‌లో ప్రధాన ఐటీ కంపెనీ విప్రో గత నెల 375 మిలియన్ డాలర్లతో వాటాను దక్కించుకున్నది. ఈ ఏడాది డిసెంబర్ 31కల్లా ఈ డీల్ పూర్తవుతుందని ఇండస్ట్రీ వర్గాల అంచనా. అలాగే విప్రో, హర్మన్, సామ్‌సంగ్‌ల మధ్య ఓ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కూడా కుదిరిందని చెప్తున్నారు. ఇప్పటికే తమ అనుబంధ సంస్థ విప్రో పారీ ద్వారా భారీ మెషినరీ తయారీ సంస్థలకు విప్రో సేవలందిస్తున్నది. ఈ నేపథ్యంలో విప్రో-హర్మన్స్ లావాదేవీ మిక్కిలి ఫాక్స్‌కాన్‌తోకలిసిఓఫ్యాబ్‌ను పెడుతున్నది. ఈ ప్రాజెక్టుపై పెట్టుబడులు రూ.3,706 కోట్లుగా ఉన్నాయి. మేలో కేంద్ర క్యాబినెట్ కూడా ఇందుకు ఆమోదంతెలిపింది. 2019, 2020 ల్లోనే హెచ్‌సీఎల్ టెక్.. సంకల్ప్ సెమీకండక్టర్‌నుసొంతం చేసుకున్నది. నిరుడు ఇంటెల్ ఫౌండ్రీతో విప్రో, హెచ్‌సీఎల్ టెక్ జట్టుకట్టాయి. దేశీయ రెండో అతిపెద్ద ఐటీ రంగ సంస్థ ఇన్ఫోసిస్‌కూడా బెంగళూరుకు చెందిన సెమీకండక్టర్ డిజైన్, ఎంబెడ్డెడ్ కంపెనీ ఇన్‌సెమీతో గత ఏడాది జట్టు కట్టింది. సిరియం సిస్టమ్స్‌ను టెక్ మహీంద్రా, ఎగ్జిమస్ డిజైన్‌ను విప్రో



హస్తగతం చేసుకున్నాయి. యాక్సెంచర్, క్యాప్‌జెమినీ తదితర అంతర్జాతీయ సంస్థలూ థర్డ్-పార్టీ ఆర్‌అండ్‌డీ సర్వీసులను అందిస్తున్నాయి. మధ్యశ్రేణి ఐటీ రంగ కంపెనీ సైయెంట్ ఏకంగా సొంతంగానే సైయెంట్ సెమీకండక్టర్స్ పేరిట ఓ సెమీకండక్టర్ సంస్థను తీసుకొచ్చింది. ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్, దాని అనుబంధ సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ ఆధ్వర్యంలో ఎల్‌అండ్‌టీ సెమీకండక్టర్ టెక్నాలజీస్ పరిచయమైంది. దేశీయ ఐటీ రంగ దిగ్గజ సంస్థ టీసీఎస్.. ఇటీవలే తమ చిప్‌సెట్ ఆధారిత సిస్టమ్ ఇంజినీరింగ్ సర్వీసెస్‌ను ప్రారంభించింది. సెమీకండక్టర్ కంపెనీలు సరికొత్త సెమీకండక్టర్లను తయారు చేసేందుకు దోహదం చేసేలా దీన్ని రూపొందించారు. టాటా ఎలక్ట్రానిక్స్ ఇందులో భాగస్వామ్యమై ఉంటుంది. తైవాన్‌కు చెందిన పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్ప్‌తో టాటా ఎలక్ట్రానిక్స్ టై-అప్ అయ్యింది. ఈ క్రమంలోనే గుజరాత్‌లో కొన్ని చిప్ తయారీ కేంద్రాలను తెచ్చే ఆలోచనలో కూడా టాటా గ్రూప్ ఉన్నది. ప్రస్తుతం గ్లోబల్ సెమీకండక్టర్ మార్కెట్ విలువ దాదాపు 600 బిలియన్ డాలర్లుగా ఉంటుందని ఇండస్ట్రీ నిపుణుల అంచనా. అయితే 2032 నాటికి ఇది 2 ట్రిలియన్ డాలర్లను తాకవచ్చని చెప్తున్నారు. నిపుణుల మాటేంటి? ప్రస్తుతం ఐటీ ఇండస్ట్రీకి అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయని, ఈ తరుణంలో ఆయా సంస్థలు ఇతర వ్యాపార రంగాల వైపు చూడటం మంచిదేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతీయ ఐటీ పరిశ్రమకు దేశీయంగా కంటే విదేశీ ప్రాజెక్టుల ద్వారా వచ్చే ఆదాయమే ఎక్కువగా ఉంటున్నది. అందులోనూ అమెరికా, ఐరోపాల వాటా అధికం. అయితే ఇప్పుడు ఆయా దేశాల్లో పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. దీంతో ఐటీ కంపెనీలు ఖర్చుల్ని తగ్గించుకొనే పనిలోపడ్డాయి. కొత్త నియామకాల సంగతి పక్కనపెడితే.. ఉన్న ఉద్యోగులనే భారీగా తీసేస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది

# భారత్-అమెరికా ట్రేడ్ డీల్ ఎఫెక్ట్

**తగ్గనున్న హార్లే డేవిడ్సన్ బైకుల ధరలు!**

**అమెరికా నుంచి దిగుమతయ్యే మోటారు సైకిళ్లపై సుంకం తగ్గించినట్లు ప్రకటించిన భారత్**

**800 సీసీ నుంచి 1600 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన బైక్‌లపై ఇకపై ఎలాంటి దిగుమతి సుంకాలు ఉండబోవని వెల్లడి**

**అమెరికా ప్రీమియం బైక్ తయారీ సంస్థ హార్లే డేవిడ్‌సన్‌కు భారీ ఊరట**



అమెరికా నుంచి దిగుమతయ్యే మోటారు సైకిళ్లపై భారత్ భారీగా సుంకాలను తగ్గించింది. భారత్ - అమెరికా మధ్య ఎట్టకేలకు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. 800 సీసీ నుంచి 1600 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన బైక్‌లపై ఇకపై ఎలాంటి దిగుమతి సుంకాలు ఉండబోవని అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో అమెరికా ప్రీమియం బైక్ తయారీ సంస్థ హార్లే డేవిడ్‌సన్‌కు ఈ ఒప్పందం పెద్ద ఊరటగా మారనుంది. ఇదివరకే హార్లే డేవిడ్‌సన్‌కు ప్రభుత్వం సుంకాల విషయంలో కొంత వెసులుబాటు కల్పించింది. గతేడాది 1600 సీసీ వరకు ఇంజిన్ సామర్థ్యం కలిగిన వాహనాలపై 50 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 40 శాతానికి తగ్గించింది. అలాగే 1600 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న వాహనాలపై 50 శాతం సుంకాన్ని 30 శాతానికి కుదించింది. ఇక తాజాగా కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భారత్ - అమెరికా ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. దీనిపై మార్చిలో అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. ఒప్పందం అమలులోకి వచ్చిన తేదీ నుంచే కొత్త సుంకాల విధానం అమల్లోకి రానుంది. అమెరికా నుంచి దిగుమతయ్యే కార్లపై కూడా భారత్ సుంకాలను తగ్గించింది. 3000 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన పెట్రోల్, డీజిల్ వాహనాలపై 10 సంవత్సరాల పాటు 30 శాతం చొప్పున సుంకం వర్తించనుంది. అయితే ఎలక్ట్రిక్ కార్లను ఈ ట్రేడ్ డీల్ నుంచి మినహాయించారు. దీంతో టెస్లాకు ఈసారి పెద్దగా ఊరట లభించనట్లయింది. టెస్లా విక్రయిస్తున్న మోడల్ వై కార్లపై టారిఫ్‌లు యథాతథంగా కొనసాగనున్నాయి. ఇది దేశీయ ఆటోమొబైల్ కంపెనీలైన టాటా, మహీంద్రాలకు మాత్రం ఊరట కలిగించే అంశంగా భావిస్తున్నారు.

# హైదరాబాదులో భారీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

**హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ హెడ్‌గా రమేశ్ కాజాను నియమించినట్లు వెల్లడి**

**అమెరికాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఒకటిగా ఎల్‌పీఎల్‌కు గుర్తింపు**

**ప్రస్తుతం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లో నియామక ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడి**




అమెరికాకు చెందిన దిగ్గజ వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ప్రారంభించినట్లు ప్రకటించింది. అదే సమయంలో కొత్త కార్యకలాపాలకు హెడ్‌గా రమేశ్ కాజాను నియమించినట్లు వెల్లడించింది. ఫార్చ్యూన్ 500 కంపెనీ అయిన ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ అమెరికాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ సంస్థ ప్రస్తుతం 32 వేల మందికి పైగా ఫైనాన్షియల్ అడ్వైజర్లకు, 1,200కు పైగా ఆర్థిక సంస్థలకు వెల్త్ మేనేజ్‌మెంట్ సేవల సపోర్ట్ అందిస్తోంది. అంతేకాకుండా, దాదాపు 80 లక్షల మంది క్లయింట్లకు సంబంధించిన 2.4 ట్రిలియన్ డాలర్ల నిధులను నిర్వహిస్తోంది. అధునాతన ఫైనాన్షియల్ టెక్నాలజీ టూల్స్, వినూత్న అప్లికేషన్ల ప్లాట్‌ఫాం ద్వారా.. ఫైనాన్షియల్ అడ్వైజర్లు తమ క్లయింట్లకు వ్యక్తిగతీకరించిన ఆర్థిక ప్రణాళికలు అందించేందుకు ఉపయోగపడే ఇన్వెస్ట్‌మెంట్ సొల్యూషన్స్, వెల్త్ మేనేజ్‌మెంట్ ప్రోడక్టులను ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ అందిస్తోంది. టెక్నాలజీ, ఆపరేషన్స్ విస్తరణలో భాగంగా ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ ఈ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. ఆర్థిక సేవల రంగంలో ప్రతిభావంతుల లభ్యత, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, అలాగే వ్యాపారాన్ని కొనసాగించేందుకు అనుకూల వాతావరణం ఉండటంతో హైదరాబాద్‌ను ఎంపిక చేసినట్లు సంస్థ తెలిపింది. రాబోయే మూడు నుంచి ఐదేళ్లలో హైదరాబాద్ కేంద్రం ద్వారా టెక్నాలజీ, ఆపరేషన్స్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్, డేటా అండ్ అనలిటిక్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో వందల సంఖ్యలో ఉద్యోగాలను కల్పించనున్నట్లు ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ వెల్లడించింది. ప్రస్తుతం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లో నియామక ప్రక్రియ కొనసాగుతోందని సంస్థ తెలిపింది. ఇందులో నెట్‌వర్క్ సెక్యూరిటీ, కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏఐ ఇంజినీరింగ్, డేటా ప్లాట్‌ఫార్మ్స్, మిడిల్‌వేర్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి కీలక విభాగాల్లో నిపుణులైన ఇంజినీర్లు, టెక్నాలజిస్టులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొంది. ఉద్యోగావకాశాల కోసం ఆసక్తి ఉన్నవారు ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ లింక్డ్ ఇన్ పేజీ లేదా సంస్థ అధికారిక కెరియర్స్ సైట్‌ను సందర్శించాలని సూచించింది.

# బడ్జెట్ భయాలను మరిపించిన అమెరికా డీల్



ఈ వారం భారత స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు లోనైనప్పటికీ, చివరికి మంచి లాభాలతో ముగిశాయి. 2026-27 బడ్జెట్‌లో డెరివేటివ్‌లపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ను) పెంపుతో ఆరంభంలో బలహీనపడిన సూచీలు, అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం ప్రకటనతో అనూహ్యంగా పుంజుకున్నాయి. దేశీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాలు బడ్జెట్ భయాలను అధిగమించడంతో మదుపర్లలో విశ్వాసం పెరిగింది. ఫలితంగా వారం ముగిసేసరికి సెన్సెక్స్ 83,580.40 వద్ద, నిఫ్టీ 25,693.70 వద్ద స్థిరపడ్డాయి. అమెరికా-భారత్ మధ్య ఉన్నత స్థాయి చర్చల అనంతరం భారత వస్తువులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో మార్కెట్లలో కొనుగోళ్ల ఉత్సాహం పెరిగింది. దీనికి తోడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచుతూ, జీడీపీ వృద్ధి అంచనాలను పెంచడం సెంటిమెంట్‌ను మరింత బలపరిచిందని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా తెలిపారు. 2026 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేయడం కూడా మార్కెట్లకు కలిసొచ్చింది. దేశీయంగా కూడా సానుకూల సంకేతాలు అందాయి. జనవరి జీఎస్టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 6.2 శాతం పెరిగి రూ.1.93 లక్షల కోట్లకు చేరాయి. మరోవైపు 2025లో భారత్-చైనా ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయిలో 155 బిలియన్ డాలర్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి. రంగాల వారీగా చూస్తే, రేట్-సెన్సిటివ్, దేశీయ ఆధారిత రంగాలైన రియల్టీ, ఎనర్జీ, ఆటో షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. అయితే, ఐటీ రంగం మాత్రం ఈ వారంలో తీవ్రంగా నష్టపోయి మార్కెట్ కంటే బలహీనంగా నిలిచింది. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం నిఫ్టీ 25,400 స్థాయి పైన ఉన్నంతవరకు సానుకూలంగానే కదలాడవచ్చు. ఒకవేళ ఈ స్థాయిని కోల్పోతే 25,100 వరకు దిగివచ్చే అవకాశం ఉంది. పైకి వెళ్తే, 26,000 స్థాయిని నిర్ణయాత్మకంగా అధిగమిస్తే 26,400 వద్ద ఉన్న రికార్డు గరిష్ఠాల వైపు పయనించవచ్చని వారు అంచనా వేస్తున్నారు. ఇక రానున్న రోజుల్లో, 2024ను బేస్ ఇయర్‌గా సవరించిన తర్వాత విడుదల కానున్న జనవరి వినియోగదారుల ధరల సూచీ (బూ×) గణాంకాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించనున్నారు.



## 'టాక్సిక్' తెలుగు రాష్ట్రాల డీల్ క్లోజ్..

రాకింగ్ స్టార్ యశ్ ప్రెస్టీజియస్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. హై ఎక్స్‌పెక్టేషన్స్‌తో తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 19న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఇదిలా ఉంటే.. రిలీజ్‌కు ముందే 'టాక్సిక్' సరికొత్త రికార్డ్స్‌ను క్రియేట్ చేస్తోంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈ సినిమా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన హక్కులను రూ.120 కోట్లకు సొంతం చేసుకున్నారు. దీంతో ఇది నాన్ తెలుగు సినిమాకు కోసం జరిగిన ఆల్‌టైమ్ బిగ్గెస్ట్ డీల్‌గా మారింది. ఈ ఏడాది విడుదల కానున్న మోస్ట్ అవెయిటెడ్ మూవీగా టాక్సిక్ కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో టాక్సిక్ నిర్మాతలకు శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌కు మధ్య ఈ హిస్టారికల్ డీల్‌తో సినిమాపై బజ్ మరింతగా పెరిగింది. ఏపీ, తెలంగాణ హక్కుల కోసం మూడు అగ్ర సంస్థలు పోటీ పడగా చివరకు దిల్ రాజు నేతృత్వంలోని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌కు ఈ డీల్ దక్కింది. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ దిల్ రాజు మాట్లాడుతూ.. "ఇండియన్ సినీ ఇండస్ట్రీలోని పెద్ద స్టార్స్‌లో యశ్ ఒకరు. కెజియఫ్ 2 తర్వాత ఆయన మార్కెట్ మరింతగా పెరిగింది. ఆయన నెక్స్ట్ సినిమా టాక్సిక్ కోసం ఆడియెన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత వస్తోన్న ఈ సినిమాపై ఉన్న అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి ప్రెస్టీజియస్ మూవీని మా ఎస్‌వీసీ బ్యానర్‌పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు రానుండటం చాలా ఆనందంగా ఉంది. యశ్‌తో ఇలాగే మరిన్ని సినిమాలు చేయాలని ఆశిస్తున్నాం" అన్నారు.




## మరో అర్జున్ రెడ్డి? ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న 'నిలవే' ట్రైలర్!

టాలీవుడ్ యువ నటులు సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నిలవే' వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 13న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను వదిలింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి సినీ ప్రియులు దీనిని సందీప్ రెడ్డి వంగా 'అర్జున్ రెడ్డి' సినిమాతో పోలుస్తున్నారు. ట్రైలర్‌లో హీరో ఎమోషన్స్, మేకింగ్ స్టైల్ మరియు రొమాంటిక్ సీన్స్ చాలా రా (=ఖఃఖ) గా మరియు బోల్డ్‌గా ఉండటంతో , నెటిజన్లు దర్శకుడు సౌమిత్ రావును సందీప్ వంగా స్టూడెంట్‌లా ఉన్నాడే అని ప్రశంసిస్తున్నారు. లవ్‌స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంలో హర్ష చెముడు, సుప్రియా ఐసోలా, జీవన్ కుమార్ కీలక పాత్రల్లో కనిపిస్తుండగా.. సౌమిత్ రావు & సాయి వెన్నం సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి కళ్యాణ్ నాయక్ సంగీతాన్ని అందించాడు.

## క్రూరమైన పాత్రలో రిషబ్ సాహ్నీ



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రాబోతున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'నాగబంధం'. ఈ వేసవిలో విడుదలకు సిద్ధమవుతోన్న ఈ చిత్రం నుంచి తాజాగా టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. మహా శివరాత్రి స్పెషల్‌గా ఈ నెల15న టీజర్ విడుదల కానున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఈ ఇతిహాస కథనంలోని మరో కీలక పాత్ర ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. బాలీవుడ్ 'ఫైటర్'లో తన అద్భుతమైన ప్రజెన్స్‌తో ఆకట్టుకున్న రిషబ్ సాహ్నీ నాగబంధంలో ఆఫ్ఘన్ సుల్తాన్ అబ్దాలి పాత్రను పోషిస్తున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించారు. 1750లో బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో భారత్‌లో అబ్దాలీ చేసిన దండయాత్రలు, దేవాలయాల దోపిడీ, అపార సంపద కోసం అతడు చేసిన క్రూర ప్రయత్నాలను చూపించబోతున్నారు. ఇక రిలీజ్ చేసిన ఈ హై-వోల్టేజ్ పోస్టర్‌లో చుట్టూ మెరుస్తున్న కళ్లతో ఉన్న తోడేళ్ల గుంపు అతని చుట్టూ చేరడం పాత్రలోని క్రూరత్వాన్ని మరింత పెంచుతుండగా.. సినిమాపై మరింత క్యూరియాసిటీ పెంచుతోంది.



## ఫంకీ ట్రైలర్.. అనుదీప్ మార్క్ కామెడీ, పంచులు

గతేడాది 'లైలా' సినిమాతో బొక్కబోర్లా పడ్డాడు హీరో విశ్వక్‌సేన్. ఈసారి ఎటువంటి ప్రయోగాలు చేయకుండా కామెడీ జానర్ ఎంచుకున్నాడు. జాతిరత్నాలు ఫేమ్ అనుదీప్ దర్శకత్వంలో ఫంకీ సినిమా చేశాడు. డ్రాగన్ బ్యూటీ కయాదు లోహర్ కథానాయికగా నటించింది. శనివారం (ఫిబ్రవరి 7న) ఫంకీ ట్రైలర్ రిలీజ్ చేశారు.


**ట్రైలర్ నిండా పంచులే**

ట్రైలర్ ప్రారంభం నుంచే పంచులతో, కామెడీతో అదిరిపోయింది. మీ అమ్మకు ఆపరేషన్ చేయాలంటే నాకు రాదు డాక్టర్ అన్న డైలాగ్‌తో వీడియో మొదలైంది. ఓనర్‌కు రెంట్ కట్టుడు వంటివన్నీ నాకు గలీజ్ అనిపిస్తయ్ అంటాడు హీరో. ట్రైలర్ ముగింపు వరకు పంచులకు లోటే లేకుండా కట్ చేశారు. మొత్తానికి ట్రైలర్‌తోనే మంచి హైప్ ఇచ్చారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ మూవీ ఫిబ్రవరి 13న విడుదలవుతోంది.

## 'ధురంధర్' బ్యూటీ షాకింగ్ రియాక్షన్!

బాలీవుడ్ యంగ్ బ్యూటీ ఆయేషా ఖాన్ 'ధురంధర్'లో 'షరారత్' సాంగ్‌తో ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ అమ్మడు ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉంది. వరుస అవకాశాలు అందుకుంటోంది. తాజాగా, ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ బ్యూటీ, తనను స్టార్ డాన్సర్లు నోరా ఫతేహి, తమన్నా భాటియాతో పోల్చడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియాలో తనను వారిద్దరితో పోలుస్తూ వస్తున్న రీల్స్‌ను తాను చూశానని, అయితే వారితో తనను పోల్చుకోవడం అస్సలు నచ్చదని క్లారిటీ ఇచ్చింది. "నోరా, తమన్నా అద్భుతమైన మహిళలు. నోరా స్టేజ్ పెర్ఫార్మెన్స్, ఎనర్జీ చూస్తుంటే నాకు ఆశ్చర్యం వేస్తుంది.. తను చేసేది నేను ఎప్పటికీ చేయలేను" అంటూ నోరాపై తనకున్న గౌరవాన్ని చాటుకుంది. ఇక తమన్నా గురించి మాట్లాడుతూ.. "తమన్నా ఎప్పటి నుంచో ఇండస్ట్రీలో ఉంది. ఎన్నో గొప్ప పనులు చేస్తోంది. 'ఆజ్ కీ రాత్' సాంగ్‌లో ఆమెను చూసి నేను ఫిదా అయిపోయాను. నేను ఇండస్ట్రీకి కొత్త, ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉంది" అని ఆయేషా చెప్పుకొచ్చింది. ఎవరైనా తనను వారితో పోల్చితే తనకు సంతోషం కలగదని, వారి జర్నీ వేరని స్పష్టం చేసింది. అదే విధంగా తన కో-స్టార్ క్రిస్టల్ డిసౌజాతో మనస్పర్థలు ఉన్నాయనే వార్తలను కూడా ఆమె కొట్టిపారేసింది. తామిద్దరం అప్పుడప్పుడు కలుస్తూనే ఉంటామని, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా ఆయేషా ఖాన్ క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి.





## గ్లోబల్ బ్యూటీకి మరో బంపర్ ఆఫర్

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఇండియన్ సినిమా బాక్సాఫీస్‌పై దండయాత్రకు సిద్ధమైంది. అటు టాలీవుడ్, ఇటు బాలీవుడ్ నుంచి భారీ ప్రాజెక్టులతో ఆమె వార్తల్లో నిలిచింది.దర్శకధీరుడు రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' తో ఆమె టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వనుంది. ఈ సినిమాలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనుండగా, ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఇదిలా ఉంటే.. తాజాగా, ప్రియాంక చోప్రాకు సంబంధించిన మరో హాట్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ సూపర్ హీరో ఫ్రాంచైజీ 'క్రిష్-4'లో ఆమె లీడ్ రోల్‌లో కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మళ్లీ ప్రియాంకనే హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. హృతిక్-ప్రియాంక జోడీగా గతంలో వచ్చిన 'క్రిష్' సిరీస్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న నేపథ్యంలో, అదే మ్యాజిక్‌ను మరోసారి రిపీట్ చేయాలనే ఆలోచనతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాతో చాలా ఏళ్ల విరామం తర్వాత ప్రియాంక చోప్రా బాలీవుడ్‌లో గ్రాండ్ కంబ్యాక్ ఇవ్వనుంది.

## ది ప్యారడైజ్'పై భారీ అంచనాలు..

### జోరుగా నాని గ్రాండ్ ఎంట్రీ సాంగ్ షూట్ ..!

చీఞఅఱ । 'న్యాచురల్ స్టార్ నాని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ కొనసాగుతోంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'దసరా' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడంతో, ఈ కొత్త ప్రాజెక్టుపై ఇండస్ట్రీలోనే కాకుండా ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ విజయానికే కొనసాగింపుగా ఈసారి మరింత భారీ స్థాయిలో సినిమాను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ శంషాబాద్‌లో ప్రత్యేకంగా వేసిన భారీ సెట్స్‌లో నాని ఇంట్రడక్షన్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా గ్రాండ్‌గా రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ చెబుతోంది. నాని కెరీర్‌లోనే ఇది అత్యంత మాస్ మరియు స్టైలిష్ ఎంట్రీ సాంగ్ అవుతుందనే టాక్ వినిపిస్తోంది. పాటలో భారీ డ్యాన్స్ మూమెంట్స్, ప్రత్యేక సెట్స్, వందలాది మంది డ్యాన్సర్లు పాల్గొంటుండటంతో ఈ సీన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నాడు. రఫ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో ఆయన కనిపించబోతున్నాడని ఇప్పటికే విడుదలైన పోస్టర్ల ద్వారా స్పష్టమైంది. కథ పరంగా కూడా ఇది యాక్షన్, ఎమోషన్, డ్రామా మేళవింపుతో ఉండబోతోందని సమాచారం. మొదట ఈ సినిమాను మార్చి 26న విడుదల చేయాలని భావించినా, ఇప్పుడు 2026 జూలై 25కు వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. హీరోయిన్‌గా కయాదు లోహర్ నటిస్తుండగా, సీనియర్ నటులు మోహన్ బాబు, సోనాలి కులకర్ణి, బాబు మోహన్, తనికెళ్ల భరణి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. బలమైన నటీనటుల ఎంపికతో సినిమాకు మరింత బలం చేకూరినట్లు అభిమానులు భావిస్తున్నారు.సంగీత బాధ్యతలను రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ చేపట్టడం మరో ప్రధాన ఆకర్షణగా మారింది. ఇప్పటికే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. విజువల్స్, టెక్నికల్ విలువల పరంగా కూడా సినిమా హాలీవుడ్ స్థాయిలో ఉండబోతుందని చిత్ర యూనిట్ సంకేతాలు ఇస్తోంది. మొత్తంగా 'దసరా' తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న 'ది ప్యారడైజ్' టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్‌గా మారింది. రిలీజ్ డేట్‌పై అధికారిక ప్రకటన వెలువడితే అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపు కావడం ఖాయం.




The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.